రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	సా.6.25
సహరి(ఆది)	ఉ.4.37

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.0	24.0

జయహో టీడీపీ






టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రాల్లో నాయకులు కేక్‌లు కట్ చేసి పండుగలా చేసుకున్నారు.. కార్యకర్తలు జై టీడీపీ..జయహో టీడీపీ అంటూ నినాదాలతో హోరెత్తించారు.. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎన్‌టీఆర్ విగ్రహాలకు ముసుగులు వేశారు. ఈ నేపథ్యంలో ఎన్‌టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి వాసు పుష్కర ఘాట్ వద్ద సీనియర్ నాయకులతో కేక్ కట్ చేయించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి సుజయ కృష్ణ రంగారావు కేక్ కట్ చేసి తినిపించారు. - వివరాలు 8లో

ఏసయ్యా..రావయ్యా!





గుడ్‌ఫ్రైడే వేడుకలు జిల్లా వ్యాప్తంగా వేడుకగా నిర్వహించారు. క్రైస్తవులు శిలువ మోస్తూ భారీ ర్యాలీ చేశారు..పాపుల రక్షణార్థం నీ ప్రాణాలర్పించావా కరుణామయుడా అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఏసయ్యా మళ్లీ మా చెంతకు రావయ్యా అంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చర్చిలలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రేమ విందు చేసి ఉపవాస దీక్షలు విరమించారు. రాజమహేంద్రవరంలో పలువురు విశ్వాసులు తెల్ల దుస్తులు ధరించి.. శిలువ పట్టుకుని.. క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ ర్యాలీ చేశారు. - వివరాలు 8లో

జనసేనాని శ్రీకారం



- జనసేన అధినేత పవన్ రాక నేడే
- పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారానికి ఏర్పాట్లు
- నాలుగురోజులపాటు నియోజకవర్గంలో ఉండడనున్న పవన్
- నేటి మధ్యాహ్నం 12.30గంటలకు గొల్లప్రోలుకు హెలీకాప్టర్‌లో రాక
- పాదగయలో వారాహి వాహనానికి పూజలు
- అనంతరం దత్తపీఠం సందర్శన: అక్కడినుంచి వర్మ ఇంటికి పయనం
- సాయంత్రం చేబ్రోలులో బహిరంగ సభలో ప్రసంగించనున్న పవన్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/పిఠాపురం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తూర్పుగోదావరి జిల్లా గడ్డ నుంచి అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. అధికార వైసీపీ ఓటమే లక్ష్యంగా తన ఎన్నికల వ్యూహాన్ని ఉమ్మడి జిల్లానుంచే మొదలుపెట్టనున్నారు. తాను పోటీచేస్తున్న పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం వేదికగా అసలు సిసలు ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. అమ్మవారి ఆశీస్సులతో వారాహి వాహనమెక్కి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి జనాశీర్వాదం అందించాలని పిలుపునివ్వనున్నారు. ప్రజావ్యతిరేక జగన్ ప్రభుత్వానికి చెల్లు చీటి పడేలా చేయాలని ప్రజలకు పిలుపునివ్వనున్నారు. వాస్తవానికి త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ పిఠాపురం గడ్డనుంచే ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు ఇప్పటికే పవన్ స్వయంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో పిఠాపురంనుంచి అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని పవన్ శనివారంనుంచి ప్రారంభించబోతున్నారు. దీంతో పిఠాపురం నియోజకవర్గాన్ని ఎంచుకోవడానికిగల కారణాలు, తనను గెలిపిస్తే నియోజకవర్గ రూపురేఖలు ఎలా మారుస్తాననే దానిపై పవన్ తన ఎన్నికల ప్రచార పర్యటనలో ప్రజలకు వివరించనున్నారు. తనను ఓడించడానికి పిఠాపురంలో అధికార వైసీపీ పన్నుతున్న కుయుక్తులను సైతం తన పర్యటనలో ప్రస్తావించనున్నారు. ఈ నేపథ్యంలో పవన్ పిఠాపురంలో తొలి ఎన్నికల ప్రచార పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి పిఠాపురంలో పవన్ పర్యటనపైనే నెలకొంది. శనివారంనుంచి పవన్ మొత్తం నాలుగు రోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు.

నేటి పర్యటన ఇలా..

తొలిరోజు శనివారం మధ్యాహ్నం 12.30గంటలకు గొల్లప్రోలులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని హెలీప్యాడ్‌లో పవన్ దిగనున్నారు. అక్కడినుంచి నేరుగా పిఠాపురంలోని పాదగయ క్షేత్రానికి చేరుకుని పుర్హూతికా అమ్మవారికి పూజలు చేస్తారు. అక్కడే వారాహి వాహనానికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం దత్త పీఠాన్ని సందర్శిస్తారు. అక్కడినుంచి దొంతమూరులో టీడీపీ మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్మ నివాసానికి వెళ్లి ఆయన్ను పలకరిస్తారు. అక్కడినుంచి కుమారపురంలోని ఓ ప్రైవేటు అతిథిగృహంలో బసకు వెళ్తారు. తిరిగి చేబ్రోలులోని రామాలయం సెంటర్‌లో సాయంత్రం 4.30గంటల నుంచి 6.30 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తిరిగి బసకు వెళ్తారు. కాగా ఆదివారం నాటి షెడ్యూల్‌పై శనివారం రాత్రికి స్పష్టత రానుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలిసికట్టుగా ఎన్నికలకు వెళ్తున్న నేపథ్యంలో బహిరంగ సభల్లో పవన్ తోపాటు వారాహి వాహనంపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మతోపాటు బీజేపీ నేతలు కూడా ఎక్కనున్నారు. పవన్ పిఠాపురంనుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆయనకు ఎన్నికల్లో సహకరించేందుకు అనేక జిల్లాలనుంచి నేతలు పిఠాపురానికి చేరుకున్నారు. ఎన్నికలయ్యే వరకు వారంతా ఇక్కడే ఉండి పనిచేయనున్నారు. హైదరాబాద్‌నుంచి పలువురు స్కేటర్స్ తరలివచ్చారు. వీరంతా సింగిల్ వీల్ వాహనంపై తిరుగుతూ నియోజకవర్గంలో ప్రచారం చేయనున్నారు. తెలంగాణ, బెంగళూరు, పూణే నుంచి పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పవన్ ప్రచారంలో పాల్గొననున్నారు. కాగా నియోజకవర్గంలో నాలుగురోజుల పర్యటనలో పవన్ వివిధ వర్గాలతో సమావేశం కానున్నారు. ఉప్పాడ మత్స్యకారులు, చేనేతలు, మేధావులు, వ్యాపారులు తదితరులతో సమావేశమై పిఠాపురం నియోజకవర్గానికి భవిష్యత్తులో ఏమేం చేయాలి? ఎలాంటి సమస్యలున్నాయి? వంటి అంశాలపై చర్చించి ప్రత్యేక అజెండా కూడా ప్రకటించే అవకాశం ఉంది. మరోపక్క ఈనెల 2న తర్వాత పవన్ ఇతర జిల్లాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లనున్నారు.

మలి విడతలో..

కాకినాడ రూరల్ నియోజకవర్గానికి ఏప్రిల్ 8న రానున్నారు. ఆరోజు సాయంత్రం బహిరంగసభలో ప్రసంగిస్తారు. అనంతరం ఏప్రిల్ 9న పిఠాపురంలో ఉగాది వేడుకల్లో ఎల్గొననున్నారు. ఆ తర్వాత 10న కోనసీమ జిల్లా రాజోలు, 11న పి.గన్నవరం, 12న తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. దీనికి వారాహి విజయభేరి బహిరంగ సభగా నామకరణం చేశారు. మరోపక్క పవన్ పిఠాపురంలో పోటీచేస్తున్న నేపథ్యంలో ఇప్పటికే అధికార వైసీపీ భారీగా మోహరించింది. కోట్లలో నగదు పంపిణీ, వివిధ వర్గాలను, వారి ఓట్లను కొనుగోలు చేయడానికి పెద్దఎత్తున అడ్డదారి వ్యూహాలు అమలుచేస్తోంది. నియోజకవర్గంలో మండలాలను మూడు ముక్కలు చేసి ముగ్గురు కీలక నేతలకు అప్పగించి వారి ద్వారా చెరో రూ.50కోట్ల చొప్పున ఖర్చుచేయిస్తోంది. డబ్బుల పంపకం, దొంగ ఓట్లు వేయడానికి వీలుగా ఏకంగా కడప నుంచి బృందాలను తరలిస్తోంది. వీరికోసం నియోజకవర్గంలో అద్దె ఇళ్లు కూడా తీసింది. ఈ కుయుక్తులను పసిగట్టిన జనసేనాధిపతి వైసీపీ అడ్డగోలు వ్యూహాలపై ధ్వజమెత్తారు. తనను ఓడించడానికి వైసీపీ పిఠాపురంలో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఇవ్వడానికి సిద్ధంగా ఉందని నిప్పులు కక్కారు. ఈ నేపథ్యంలో పవన్ ఎన్నికల ప్రచారం, వైసీపీ ఎన్నికల వ్యూహాలతో పిఠాపురం రాజకీయాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

అనపర్తిలో అదే పట్టు!

ఇంకనూ పట్టువీడని నల్లమిల్లి



న్యాయం కావాలి : అనపర్తి మండలం మహేంద్రవాడలో కుటుంబీకులతో కలిసి నల్లమిల్లి పర్యటన

- మహేంద్రవాడలో ప్రజాభిప్రాయ సేకరణ
- ఐదు రోజుల పాటు కుటుంబంతో పర్యటన
- కలిసిన ఐదుగురు బృందం సభ్యులు
- అధినేతను కలవాలన్న విన్నపం తిరస్కరణ
- న్యాయం చేయాలని డిమాండ్

అనపర్తి, మార్చి 29 : అనపర్తిలో అసమ్మతి సెగలు చల్లారలేదు. తొలిజాబితాలో టీడీపీ జనసేన అనపర్తి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించి ఇప్పుడు బీజేపీ అభ్యర్థికి అనపర్తి సీటును కేటాయించడం పట్ల టీడీపీ కార్యకర్తల్లో అసహనం రోజు రోజుకు పెరుగుతుంది. టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం నల్ల మిల్లి రామకృష్ణారెడ్డితో ఫోన్‌లో మాట్లాడినా ఆందోళన సద్దుమణగలేదు.ఈ మేరకు టీడీపీ అధిష్ఠానం ఐదుగురు సీనియర్ నాయకుల బృందం గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, సుజయ్ కృష్ణ రంగారావు, గన్ని కృష్ణలను రామవరం గ్రామంలోని నల్లమిల్లి నివాసానికి శుక్రవారం పంపారు. నల్లమిల్లి మూలారెడ్డి సతీమణి రామకృష్ణారెడ్డి మాతృమూర్తి సత్యవతి మాట్లాడుతూ మూలారెడ్డి అనారోగ్యంతో ఉన్నపుడు పరామర్శకు వచ్చిన చంద్రబాబు మీ కుటుంబానికి అండగా ఉంటానని మాట ఇచ్చారని.. ఇప్పుడు తమ కుటుంబానికి చేసిందేమిటని ప్రశ్నించారు. 42 ఏళ్లుగా పార్టీని నమ్ముకుని అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేసిన తమ కుటుంబానికి ఇలా చేయడం సమంజసమా అన్నారు. దీనిపై బృందం నాయకులు మౌనం వహించారు. అనంతరం నల్లమిల్లితో మాట్లాడుతూ విజయవాడ వచ్చి అధినేత చంద్రబాబుతో మాట్లాడాలని సూచించారు. అయితే తాను ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ఐదు రోజుల పాటు కుటుంబంతో కలిసి నియోజకవర్గంలో పర్యటిస్తానని మాటిచ్చానని తాను ప్రస్తుతం కలవలేనని వారి ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించారు. అనంతరం నల్లమిల్లి ఇంటి నుంచి బయటకు వస్తున్న నాయకుల బృందాన్ని టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. తమ నాయకుడు చేసిన తప్పేమిటో తేల్చి చెప్పాలని భైఠాయించారు. నియోజకవర్గంలో ఎన్‌డీఏ అభ్యర్థిగా బలంలేని వ్యక్తిని నిలపడం ద్వారా ఇటు అనపర్తి అసెంబ్లీ సీటు, రాజమండ్రి పార్లమెంట్ సీటు ఓడిపోయే ప్రమాదం ఉందని అధినేతలకు తెలియదా అంటూ ప్రశ్నించారు. కార్యకర్తలనుద్దేశించి బృందంలోని బుచ్చయ్య చౌదరి, సుజయ కృష్ణ రంగారావు కార్యకర్తలను వారించే ప్రయత్నం చేశారు. అనపర్తి నియోజకవర్గంలో టీడీపీ బలహీనపడితే వచ్చే నష్టాలు తమకు తెలుసునని దీనిని అధినేత దృష్టికి తీసుకు వెళ్లామని.. ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరామన్నారు.ఒకటి రెండు రోజుల్లో మంచి ప్రకటన వస్తుందన్న నమ్మకంతో తామంతా ఉన్నామన్నారు.

మహేంద్రవాడలో ప్రజాభిప్రాయ సేకరణ

అనపర్తిలో తెలుగుదేశం పార్టీ ఉనికిని లేకుండా చేయాలని కొంత మంది పన్నిన కుట్ర లో మూడు పార్టీల నేతలు తిప్పికొట్టాలని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి సీటు ఇవ్వకపోవడంపై శుక్రవారం తన మాతృమూర్తి నల్లమిల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, కుమారుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ సనా తనితో కలిసి శుక్రవారం అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కుటుంబంతో సహా వారంతా ఇంటింటికి వెళ్లి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న నల్లమిల్లి మూలా రెడ్డి సతీమణి కొద్ది దూరం నడచినప్పటికీ వయసు సహకరించకపోవడంతో ఆమెను రిక్షాలో కూర్చుండబెట్టి పర్యటించారు. తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంచారు. మూడు పార్టీల అధినేతలు సీటు మార్పుపై పునరాలోచన చేయాలన్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించేందుకే కుటుంబం అంతా పర్యటిస్తున్నామన్నారు. బిక్కవోలు మండలం పందలపాకలో శనివారం పర్యటిస్తానన్నారు.



టీడీపీ అధిష్ఠానం పంపిన బృందం సభ్యుల ఎదుట ఆవేదన వెలిబుచ్చుతున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తల్లి సత్యవతి

5 నుంచి బరిలోకి..

- పార్లమెంట్‌లో ప్రచారానికి పురందేశ్వరి?
- పరిస్థితులపై ఆరా తీస్తున్న భర్త దగ్గుబాటి
- పాత పరిచయస్తులతో మంతనాలు
- స్థానిక నేతలతో సమన్వయం
- కలిసిన పలువురు నేతలు
- కూటమిలో మరింత జోష్



దగ్గుబాటి వెంకటేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదిరెడ్డి అప్పారావు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేరు ఖరారు కావడంతో కూటమిలో జోష్ పెరిగింది. వచ్చే నెల 5వ తేదీ నుంచి ఆమె పూర్తిగా రంగంలోకి దిగనున్నట్టు సమాచారం. ఆ రోజు నుంచి రాజమహేంద్రవరంలోనే ఆమె ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.లోక్‌సభ పరిధిలోని ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి(చిన వెంకన్న) ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభిస్తారనే సమాచారం ఉంది. దీనిని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.ఆమె ఎన్‌టీఆర్ కుమార్తె కావడం, టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి స్వయానా సోదరి కావడంతో కూటమిలో మరింత జోష్ కనిపిస్తోంది. ఆమె తరఫున పురందేశ్వరి భర్త మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రంగంలోకి దిగారు.రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో శుక్రవారం బస చేసి జిల్లాలో తనకు ఉన్న పరిచయాలతో నాయకులు, కేడర్‌తో సమన్వయం చేసుకునే పని మొదలు పెట్టినట్టు సమాచారం. అంతే కాకుండా పాత పరిచయస్తులతోనూ మంతనాలు సాగించారు. ఆయనను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు,టీడీపీ శెట్టిబలిజసాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు మర్యాద పూర్వకంగా కలిసినట్టు సమాచారం. దీనిలో భాగంగా జిల్లాలో రాజకీయ పరిస్థితులపై ఆరా తీసినట్టు సమాచారం.రాజకీయంగా కలిసివచ్చే అంశాలు.. కలిసిరాని అంశాలపై చర్చించినట్టు తెలిసింది.

టీడీపీకి కంచుకోట..

తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్ సభ ఎన్నికల్లో టీడీపీ మూడు సార్లు, బిజెపి రెండుసార్లు, కాంగ్రెస్ నాలుగు సార్లు, వైసీపీ ఒకసారి గెలిచింది. కానీ గెలిచిన ప్రతి సారీ మెజార్టీ ఓట్ల శాతం పరిశీలించినా టీడీపీ అధికంగా ఓట్లు తెచ్చు కోవడం గమనార్హం. ఇక జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుతం అనపర్తి నియోజకవర్గంలో సమస్య ఉంది. మిగతా చోట్ల బలమైన అభ్యర్థులు రంగంలో ఉన్నారు. అనపర్తి సమస్య పరిష్కారమైతే మరింత సాఫీగా ముందుకు వెళ్లవచ్చు. అక్కడ టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి తొలిజాబితాలోనే టీడీపీ టికెట్ ఖరారు చేసింది. కానీ తర్వాత పొత్తుల వల్ల బీజేపీ ఈ సీటు తీసుకుంది.రామకృష్ణారెడ్డి బలమైన అభ్యర్థి. పైగా ఇక్కడ 1978 నుంచి రెడ్డి సామాజికవర్గం నుంచే ఎమ్మెల్యేలు ఎన్నిక వుతున్నారు. ప్రధాన పార్టీలు ఈవర్గం నేతలకే టికెట్లు ఇస్తుంటారు. అనూహ్యంగా ఈసారి బీజేపీ రెడ్డియేతర సామాజికవర్గం క్షత్రియ వర్గానికి చెందిన ఎం.శివకృష్ణంరాజుకు సీటు ఇచ్చింది.ఈ నియోజక వర్గంలో అసమ్మతి సెగలు చల్లారవలసి ఉంది. ప్రజాస్వామ్యంలో ఒక నియోజక వర్గం ఒకే వర్గానికి రాసిచ్చేయలేం. కానీ రాజకీయ పార్టీలకు గెలుపుఓటముల అంచనా ముఖ్యం.



ఎన్నికల ఏర్పాట్లపై ఆరా

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం జిల్లాలో పర్యటించారు.. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశారు. లోటుపాట్లు తెలుసుకున్నారు. గొడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. కలెక్టర్ మాధవీలత నమూనా ఈవీఎంను తీసి చూపించారు. భద్రత చర్యలపై ఆరా తీశారు. భద్రత ఏర్పాట్లను ఎస్పీ జగదీశ్ వివరించారు. - వివరాలు 7లో

మండుతున్న భానుడు

40 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 29: మార్చి నెలాఖరుకే ఎండలు మండిపోతున్నాయి. ఇక ఏప్రిల్ నెలలో ఎండలు మరింత తీవ్రస్థాయిలో ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. వాస్తవానికి మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రత ఉంటుంది. కానీ మార్చి నెలాఖరు 25వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. గరిష్ఠం 38.0, 39.0, 40.0 డిగ్రీల వరకు నమోదయ్యాయి. కనిష్ఠం 21.0, 22.0, 23.0, 24.0 డిగ్రీలుగా నమోదయ్యాయి. శుక్రవారం గరిష్ఠంగా 40.0 కనిష్ఠంగా 24.0 డిగ్రీలుగా ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలకు వేడి గాలులు వీయడం ప్రారంభమైంది. నగరంలో బయట తిరిగే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఉక్కబోత ఆరంభం కావడంతో ఆపసోపాలు పడుతున్నారు.దీంతో ఉదయం,సాయంత్రం వేళ పనులు ముగించుకుంటున్నారు.మధ్యాహ్నం రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.వచ్చే నెల ఆరంభంలోనే ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరే అవకాశాలున్నాయి. దీంతో ప్రజలు ఇప్పటి నుంచే భయపడుతున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

చాగల్లు, మార్చి 29: అప్పుల బాధ తాళలేక చాగల్లుకు చెందిన కౌలు రైతు బత్తిన శ్రీనివాస్(45) ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ పి.నాగరాజు శుక్రవారం తెలిపారు. శ్రీనివాస్ వ్యవసాయ కూలి.ఎకరం పొలం కౌలుకు తీసుకున్నాడు.కుటుంబ అవసరాలకు ఏడాది కిందట రూ.4 లక్షలు అప్పు చేశాడు. అందులో రూ.2 లక్షలు ప్రతి వారం వాయిదా రూ.3 వేలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నాడు. అయితే రెండు వారాల కిందట పొలంలో పనిచేస్తుండగా పడిపోవడంతో చేతికి బలంగా గాయమైంది. దీంతో పనులకు వెళ్లలేక ఇంటి వద్దనే ఉండి వైద్యం చేయించుకుంటున్నాడు. దీంతో ప్రతి వారం చెల్లించే వాయిదాల సొమ్ము చెల్లించకపోవడంతో అప్పు తీసుకున్న వారి నుంచి ఒత్తిడి మొదలైంది. దీంతో మనస్తాపం చెంది గురువారం తన ఇంటిలోనే కలుపు మందు తాగినట్టు కుటుంబీకులు తెలిపారు. వైద్యం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.



ఏప్రిల్ 5 నుంచి వాడపల్లి వెంకన్న అధ్యయనోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి29: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి అధ్యయనోత్సవాలను ఏప్రిల్ 5 నుంచి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ద్రవిడ వేదపారాయణ, సేవాకాలం, సాయంత్రం వాహన సేవలు ఉంటాయన్నారు. ఐదు రోజులూ అష్టోత్తర పూజలు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రెండు పర్యాయాలు జరుగుతాయన్నారు. 9న ఉగాది పర్వదినం రోజున అష్టోత్తర పూజలు రద్దు చేశామని, అలాగే ఐదు రోజులూ నిత్య కల్యాణాలు జరగవని చెప్పారు. ఏప్రిల్ 18 నుంచి 14వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు జరుపుతామన్నారు. లక్షలాది మంది భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 6, 20వ తేదీల్లో స్వామివారి సుప్రభాత సేవ రద్దు చేస్తున్నట్టు ఈవో చెప్పారు.


సముద్రంలో విన్యాసాల్లో పాల్గొన్న ఐఎన్ఎస్ ఐరావత్ యుద్ధ నౌక


బీచ్‌లో దాడుల్లో పాల్గొన్న ఆర్మీ సిబ్బంది


అమెరికాకు చెందిన సమగ్ర ల్యాండింగ్ క్రాఫ్ట్ ఎయిర్ కుషన్


విమానం నుంచి రోప్‌తో కిందకు దిగుతున్న సైనికులు

కాకినాడ సాగరంలో అద్భుత విన్యాసాలు

ఆకట్టుకున్న టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాలు

పాల్గొన్న ఇండో-అమెరికా యుద్ధ నౌకలు


బీచ్‌లో యుద్ధ ట్యాంకర్‌తో మోహరించిన దృశ్యం


ఇండియా-అమెరికా సైనికాధికారులు అఖిలేష్ కుమార్, జన్నీఫర్ లార్సన్


బీచ్‌లో దాడుల్లో పాల్గొన్న ఆర్మీ సిబ్బంది

సర్పవరం జంక్షన్, మార్చి29: ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయంఫ్-24 యాంపిబీఎస్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమెరికాకు చెందిన యుద్ధ నౌకలతోపాటు ఇండియా తురుపుముక్కలు ఐఎన్ఎస్ జలస్వ, కేసరి, ఐరావత్ యుద్ధ నౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొని యుద్ధ సమయంలో శత్రుదేశాలపై చేసే వీరోచిత పోరాట ప్రదర్శన, విపత్తులు, ఆపద సమయంలో మానవతా సహాయం అందించే రిస్క్యూ సమయంలో అందించే సేవలు ప్రదర్శించారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో ఎక్స్ టైగర్ ట్రయంఫ్-24 సీ ఫేజ్‌లో భాగంగా భారత్-అమెరికా యాంపిబీఎస్ విన్యాసాల్లో భాగంగా గత మూడు రోజులుగా ఇండియా నుంచి 700 మంది, అమెరికా నుంచి 400 మంది సభ్యులు విన్యాసాల్లో పాల్గొని యుద్ధ సమయంలో నిర్వహించే విధులను పోరాట పటిమను ప్రదర్శించారు. భారత్ భూభాగంలోకి ఉగ్రవాదుల చొరబాట్లు, భూభాగం ఆక్రమణకు ప్రయత్నిస్తున్న శత్రుదేశంపై త్రివిధ దళాలు దాడులు చేసి, శత్రువు శిబిరాలపై ఆకాశ, జల, భూభాగంపై నుంచి మెరుపు దాడులతో ఆటకట్టించింది. భారతదేశ తూర్పునావికా దళానికి చెందిన ఐఎన్ఎస్ ఐరావత్, కేసరి, ఐఎన్ఎస్ జలస్వ ఈ మూడు యుద్ధ నౌకలు సహా అమెరికాకు చెందిన సోమర్‌సెట్ యుద్ధ నౌకతోపాటు త్రివిధ దళాలు శత్రుదేశ దురాక్రమణ, ఉగ్రవాదుల చొరబాట్లను అడ్డుకుని సమర్థవంతంగా తిప్పికొట్టారు. అలాగే తుపాన్లు, విపత్తుల సమయంలో అందించే సేవలను ఈ విన్యాసాల్లో సిబ్బంది ప్రదర్శించారు. ఐఎన్ఎస్ జలస్వ, ఐరావత్, కేసరి యుద్ధనౌకల్లో నుంచి సిబ్బంది, హెలికాప్టర్లు, మెకనైజ్డ్ లాంగ్‌ల్యాండింగ్ క్రాఫ్టులు, ల్యాండింగ్ ప్లాట్‌ఫారమ్ డాక్, ల్యాండింగ్ షిప్ ట్యాంకులు, శాస్ ఎయిర్‌క్రాఫ్ట్, మెకనైజ్డ్ ఫోర్సెస్‌తో భారీ వెసల్స్, జెమినీ బోట్లు, జెట్‌లు, యుద్ధ ట్యాంకర్లు, బంకర్లలలో ఆర్మీ సిబ్బంది వెపన్లతో జల, భూఉపరితలం, ఆకాశమార్గాల ద్వారా నిర్వహించిన విన్యాసాలు వారెవ్వా అనిపించాయి. అలాగే అమెరికా నుంచి సమగ్ర ల్యాండింగ్ క్రాఫ్ట్ ఎయిర్ కుషన్‌లు, హెలికాప్టర్లతో కూడిన ల్యాండింగ్ ప్లాట్‌ఫారమ్ డాక్, డిస్ట్రాయర్, లాంగ్ రేంజ్ మేరిటైమ్ రికనైసెన్ ఎయిర్ క్రాఫ్ట్ ల్యాప్‌షిప్ మెడియేట్ పాల్గొన్నాయి.

ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

సైనిక విన్యాసాల ద్వారా ఇండియా-అమెరికా దేశాల మధ్య బలమైన, వ్యూహాత్మకమైన భాగస్వామ్యం ఏర్పడుతుందని ఆర్‌ఏడీఎం మార్షినెజ్ మేజర్ జనరల్ (54వ డివిజన్) అఖిలేష్‌కుమార్, నేవీ కమాండెంట్ రాజేష్ ధన్‌కర్, అమెరికా కాన్సిల్ జనరల్ జన్నీఫర్ లార్సన్‌లు అన్నారు. టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాల్లో ముఖ్య అతిథిగా హాజరైన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇరు దేశాల త్రివిధ దళాల సామర్థ్యాల పెంపు, భవిష్యత్తు కార్యాచరణపై ప్రణాళికలు నిర్వహించేందుకు ఈ విన్యాసాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉభయచర, మానవతా సహాయం, విపత్తు ఉపశమనం తదితర అంశాలపై నిర్వహించిన విన్యాసాలతో నైపుణ్యాలు మరింత పెరుగుతాయన్నారు. ఈ విన్యాసాలు ఈనెల 18 నుంచి 24 వరకు వైజాగ్ హార్బర్ బేస్డ్ విన్యాసాలు, 26 నుంచి 29వ వరకు సముద్రం (సీబేస్డ్) యాక్టవిటీస్ చేపట్టడం జరిగిందన్నారు. కాకినాడలో సైనిక విన్యాసాలకు అన్ని విధాలా అనువైన ప్రాంతమని చెప్పారు.



వేసవి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు పొడిగింపు

సామర్లకోట, మార్చి29: వేసవి నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక రైళ్లను పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే యంత్రాంగం నిర్ణయించింది. అందులో భాగంగా కాకినాడ-లింగంపల్లి మధ్య రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును ఏప్రిల్ 1 నుంచి జూన్ వరకూ పొడిగించారు. దీంతో సామర్లకోట మీదుగా కాకినాడ నుంచి లింగంపల్లి మధ్య ఈ ప్రాంత ప్రయాణికులకు రవాణా కష్టాలు తీరనున్నాయి. ఈ మేరకు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు సికింద్రాబాద్ రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

07445 నంబరు గల కాకినాడ టౌన్- లింగంపల్లిల మధ్య రాకపోకలు సాగించే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతీ సోమ, బుధ, శుక్రవారాలలో ఏప్రిల్ 1 నుంచి జూన్ 28 వరకూ పొడిగించారు.

07446 నంబరు గల లింగంపల్లిల మధ్య రాకపోకలు సాగించే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతీ మంగళ, గురు, శనివారాలలో ఏప్రిల్ 2 నుంచి జూన్ 29 వరకూ పొడిగించారు.

ఈ రైళ్లల్లో ప్రయాణించే ప్రయాణికులు రిజర్వేషన్ సదుపాయాలకు సమీపంలో ఉన్న రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద సిబ్బందిని సంప్రదించాలని రైల్వే పీఆర్వో అధికారి ఆ ఆదేశాల్లో తెలిపారు.

పవన్‌కల్యాణ్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు


గొల్లప్రోలు పట్టణ శివారులో పవన్‌కల్యాణ్ దిగనున్న హెలిప్యాడ్

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మార్చి29: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గ పర్యటనకు ఆ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలకు ఇక్కడ నుంచే శ్రీకారం చుట్టడంతోపాటు పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన తర్వాత తొలిసారి వస్తుండడంతో భారీగా స్వాగతం పలికేందుకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. గొల్లప్రోలులోని హెలిప్యాడ్ వద్ద పవన్ హెలికాప్టర్ దిగనున్న నేపథ్యంలో అక్కడ బారికేడింగ్ చేస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు చేబ్రోలు రామాలయం సెంటర్‌లో వారాహి వాహనంపై నుంచి పవన్ ప్రసంగిస్తారు. ఇక్కడ జరిగే బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లపై జనసేన నాయకులు, అధికారులు పరిశీలన జరిపారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో పవన్‌కల్యాణ్ నాలుగు రోజులు బస చేస్తారని భావిస్తున్నారు. కాగా జనసేన తరఫున ప్రచారం చేసేందుకు వచ్చిన స్కేటర్లు పట్టణంలో సందడి చేశారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

అపరిచిత మహిళలతో తస్మాత్ జాగ్రత్త!

- బట్టల షాపుల్లో మహిళల ముఠా చోరీలు
- అనుమానంతో 8 మందిని పోలీసులకు అప్పగించిన ముంగండ గ్రామస్తులు
- ముంగండలో మూడు నెలలు కిందట చోరీ
- అనుమానితులపై పాత దొంగతనం కేసులు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు

పి.గన్నవరం, మార్చి29: ఆరుగురు నుంచి పదిమంది మహిళలు ఒక బృందంగా ఏర్పడి ప్రత్యేక వాహనంలో చేరుకొని గ్రామాల్లోని బట్టలషాపుల్లో బేరసారాలతో వ్యాపారస్తుల కన్నుకప్పి ఖరీదైన చీరలు దోచేస్తున్నారు. మండలంలోని ముంగండలో గత మూడు నెలల కిందట ఈ తరహా చోరీ జరిగింది. తాజాగా ఆరుగురు మహిళలు శుక్రవారం ముంగండ వివిధ ప్రాంతాల్లోని స్థానిక బట్టలషాపులో హల్‌చల్ చేయడంతో అనుమానంతో స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం జనవరి 6న ముంగండలో నరేంద్రపురం రోడ్డులోని బండారు బొటెక్ అండ్ బ్యాగ్స్ షాపులో ఎనిమిది మంది మహిళలు ఒకేసారి చొరబడి షాపు యజమాని కన్నుకప్పి రూ.20 వేల విలువైన బట్టలు దోచుకుపోయారు. 15 నిమిషాల తర్వాత విషయాన్ని గ్రహించిన షాపు యజమాని వారి ఆచూకీ కోసం గాలించినా దొరకలేదు. మళ్లీ శుక్రవారం ఆరుగురు మహిళలు స్థానిక కళాశాల వద్ద ఉన్న శ్రీనివాస టెక్స్‌టైల్స్‌లోకి ప్రవేశించి వ్యాపారి బొడ్డు నాగేశ్వరావును మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇంతలో అప్పటికే వీరి ప్రవర్తనను గమనించిన స్థానికులు, ఆటోయూనియన్ సభ్యులు బట్టలు షాపు వద్దకు చేరుకున్నారు. విషయాన్ని గ్రహించిన మహిళలు అక్కడ నుంచి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అలాగే మహిళలు కూడా ఉన్న ఇద్దరు మగవారు అక్కడ నుంచి జారుకోగా మొత్తం ఎనిమిది మందిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే వారి వద్ద మందు బిళ్లలు, గోనె సంచులు, రోల్డ్ గోల్డ్ నగలు ఉన్నట్టు స్థానికులు చెప్తున్నారు. ఎస్ఐ బి.శివకృష్ణ మాట్లాడుతూ ముంగండలో పట్టుపడ్డ వారంతా విజయవాడ సమీపంలోని జి.కొండూరు మండలమని తెలిపారు. వీరిపై వివిధ చోట్ల పాత చిల్లర దొంగతనం కేసులు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టంచేశారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

8న అంబేడ్కర్ జీవితం కృషిపై నృత్య రూప నాటక ప్రదర్శన

కాకినాడ సిటీ, మార్చి 29: బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవితం కృషిని వివరిస్తూ హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ రూపొందించిన 'సంఘం శరణం గచ్ఛామి' నృత్య రూప నాటక ప్రదర్శనను ఏప్రిల్ 8వ తేదీ సాయంత్రం కాకినాడ సూర్య కళామందిరంలో ఏర్పాటు చేసినట్టు వివిధ ప్రజా సంఘాల నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంద్రపాలెం వంతెన అంబేడ్కర్ విగ్రహం వద్ద నాటక ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను అంబేడ్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే పేరెన్నికగన్న నాయకుడని అన్నారు. ఆయన బాల్యంలో, యుక్త వయసులో పడిన కష్టాలు, దేశం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన కృషి, తపన ఈ నాటకంలో చూడవచ్చన్నారు. అంబేడ్కర్ కొందరివాడు కాదని, అందరివాడని ఈ నాటకం చూస్తే అర్థమవుతుందన్నారు. సీఐటీయూ, యూటీఎఫ్, జేవీవీ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డీవైఎఫ్ఐ వంటి ప్రజా సంఘాలన్నీ సంయుక్తంగా ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేశాయన్నారు. నగర ప్రజలు అంబేడ్కర్ నాటక ప్రదర్శను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు, కోశాధికారి మలక వెంకటరమణ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, రూరల్ కన్వీనర్ టి.రాజా, ఐద్వా నగర కార్యదర్శి కె.నాగజ్యోతి పాల్గొన్నారు.


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో ఎస్‌హెచ్‌వో

కల్యాణ మండపంలో చోరీకి పాల్పడ్డ నిందితుడు అరెస్టు

148 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

సర్పవరం జంక్షన్, మార్చి29: ఈనెల 17వ తేదీన ఆర్టీవో ఆఫీసు రోడ్డులోని కమ్మ కల్యాణ మండపంలో జరిగిన వివాహ ఫంక్షన్‌లో చోరీకి గురైన 148 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్ట్ చేసినట్టు సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. వివాహం జరుగుతున్న సమయంలో పిఠాపురం పట్టణానికి చెందిన కె.వీరశంకర్ అతిథిలా వచ్చి అక్కడే సోఫాపై ఉన్న కాకినాడకు చెందిన గుణ్ణం సత్యనారాయణ కుటుంబసభ్యులకు చెందిన హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి లాకెట్ కలిగిన 148 గ్రాముల మూడు బంగారు చైన్లను తీసుకుని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో హనుమంతరావు నేతృత్వంలో నిందితుడు కోసం గాలిస్తుండగా గురువారం ఆర్టీవో ఆఫీసు వద్ద వీరశంకర్‌ని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. నిందితుడి నుంచి చోరీకి పాల్పడ్డ సుమారు రూ.2.40 లక్షల విలువైన 148 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడి పట్టివేతలో కీలకంగా వ్యవహరించిన సీఐ శ్రీనివాస్, ఏఎస్ఐ జి బలరామమూర్తి, హెచ్‌సీలు గణేష్‌బాబు, పి.సత్యనారాయణరాజు, కె. వెంకటరత్నంలను ఎస్పీ సతీష్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు.

తప్పుడు రిపోర్టు పంపారంటూ ఎస్ఐపై ఫిర్యాదు

రంగంపేట, మార్చి 29: తప్పుడు రిపోర్టు పంపిన రంగంపేట ఎస్ఐపై జిల్లా కలెక్టర్‌కి, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు రంగంపేట గ్రామానికి చెందిన యన్నన సుబ్బారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత నెల 4వ తేదీన తమ అన్నదమ్ముల ఆస్తి వివాదంపై స్పందనలో అమరావతికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి నివేదిక పంపాలని అక్కడ నుంచి స్థానిక పోలీసులను ఆదేశించారన్నారు. దీంతో గత నెల 18న ఎస్ఐ విజయ్‌కుమార్ విచారణ జరిపి తప్పుడు నివేదికను స్పందన వారికి సమర్పించారన్నారు. విచారణ సమయంలో తాము ఆ స్థలానికి సంబంధించిన దస్తావేజులు, ఇంటి పన్ను రశీదులు ఇచ్చినప్పటికీ తీసుకోకుండా- విచారణ రిపోర్టులో పత్రాలు లేవని, కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని తప్పుడు రిపోర్టు పంపారన్నారు. ఈ విచారణలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహశీల్దార్ లతీఫ్ పాషా, మండల కమిటీ కూడా సహకరించారన్నారు. తనకు న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని యన్నన సుబ్బారావు తెలిపారు. దీనిపై ఎస్ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ స్థలం వివాదం గురించి తానేమి రిపోర్టు పంపించలేదన్నారు. ఇది సివిల్ మేటర్ కనుక సివిల్ కోర్టులో తేల్చుకోవాలని సుబ్బారావుకు చెప్పానని, ఈ స్థలం గురించి రెవెన్యూ అధికారులకు తెలుస్తుంది కనుక తహశీల్దార్ కార్యాలయానికి పంపించానని చెప్పారు.

కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా

నన్నయ వర్శిటీలో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ పరిశీలన


కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న సీఈవో ముకేష్‌కుమార్ మీనా, జిల్లా ఉన్నతాధికారులు

దివాన్‌చెరువు, మార్చి 29: ఈవీఎం, ఇతర అనుబంధ యూనిట్లను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతతోపాటు ఇతర రక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) ముకేష్‌కుమార్ మీనా వెల్లడించారు. జిల్లా పర్యటనలో భాగంగా దివాన్‌చెరువు పరిధిలోని నన్నయ యూనివర్శిటీ ఆవరణలో ఏర్పాటుచేసిన వివిధ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో చేపట్టిన కార్యాచరణ ప్రణాళికలు, రూట్ మ్యాప్‌పై సమగ్ర సమాచారాన్ని జిల్లా కలెక్టర్ మాధవీలత సీఈవోకు వివరించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఈవీఎమ్‌లు, ఇతర అనుబంధ యూనిట్స్ నన్నయ వర్సిటీకి తీసుకొస్తామన్నారు. రిసెప్షన్ కేంద్రం వద్ద ఈవీఎమ్‌లను స్వీకరించిన అనంతరం నిర్దిష్టమైన రూట్‌లో ఆయా నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూమ్‌కి తరలించనున్నట్టు కలెక్టర్ వివరించారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బ్యాలెట్ యూనిట్స్, రిసెప్షన్ కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూమ్ వరకు తీసుకొని వచ్చే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ ఇస్తామని కూడా ఆమె తెలియజేశారు. తదనంతరం సీఈవో ముకేష్‌కుమార్ మీనా చేసిన సూచనల మేరకు పలు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చెప్పారు. పోలీస్ పరంగా అన్ని భద్రతా చర్యలు తీసుకోవడంతోపాటు, జిల్లా ఎన్నికల అధికారితో సమన్వయం చేసుకుంటామని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా సీఈవో వెంట రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో ఎన్.తేజ్‌భరత్, కొవ్వూరు ఆర్వో అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, రాజానగరం ఆర్వో చైత్రవర్షిణి, నిడదవోలు, గోపాలపురం ఆర్వోలు రమణానాయక్, శివజ్యోతి, తదితరులున్నారు.


ధ్రువపత్రాలను అందజేస్తున్న కేవీకే హెడ్ నాయుడు, ఆత్మ పీడీ జ్యోతిర్మయి

పాడి పశువుల్లో వ్యాధులపై అవగాహన అవసరం

పశువుల్లో ప్రథమ చికిత్సపై కేవీకేలో ముగిసిన శిక్షణ

రాజానగరం, మార్చి 29: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పాడి పశువుల్లో సంక్రమించే వ్యాధులపై అవగాహన ఉండాలని కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు సూచించారు. పశువుల్లో ప్రథమ చికిత్స యాజమాన్యంపై గ్రామీణ యువతకు కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో వారంరోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ శుక్రవారం ముగిసింది. ఆత్మ తూర్పుగోదావరి జిల్లా సౌజన్యంతో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాడిపశువుల పోషణ, యాజమాన్యం, టీకాలు, పశుగ్రాసం రకాలు, సాగు, పాల దిగుబడికి పాటించాల్సిన అంశాలు, పశువుల్లో సంక్రమించే వ్యాధులు, నివారణ, ముఖ్యంగా పొదుగువ్యాధి (మాస్టయిటీస్) గుర్తింపు, చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ, ప్రదర్శన నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన ఔత్సాహిక గ్రామీణ యువతీయువకులకు కేవీకే రిటైర్డ్ వైద్యులు డాక్టర్ పీవీవీఎస్ శివరావు, డాక్టర్ బి.జాన్‌బాబు పశువుల్లో ప్రథమ చికిత్స, పోషణ యాజమాన్యంపై శిక్షణ, అవగాహన కల్పించారు. కార్యక్రమం నిర్వహణకు ప్రోత్సహించిన ఐకార్-సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్‌కు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్లో ఎలక్ట్రిక్ వాహనాలు

మరి కొద్దిరోజుల్లో అందుబాటులోకి..

రాజమహేంద్రవరం, మార్చి29(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో మరో కొత్త సదుపాయం అందుబాటులోకి రానుంది. త్వరలో ఎలక్ట్రిక్ వాహనాలు ప్లాట్‌ఫాంపై పరుగులు పెట్టనున్నాయి. బయటి నుంచి రైల్వే ప్లాట్‌ఫాంపైకి, అక్కడ నుంచి బయటకు ప్రయాణికులను తరలించడానికి ఈ సదుపాయాన్ని తీసుకొస్తున్నారు. రైలు బోగీ వద్దకు ఈ వాహనాలు వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకొని బయట ప్రాంగణంలో దింపుతాయి. అందుకు ఒక్కొక్కరికి రూ.50 చొప్పున వసూలు చేస్తారు. రెండు ఎలక్ట్రిక్ వాహనాలు వచ్చే నెల 29వ తేదీలోపు రాజమండ్రి రైల్వే స్టేషనులో అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు టెండర్లు ఖరారయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనాల వల్ల వృద్ధులు, రోగులకు బాగా ఉపయుక్తంగా ఉంటుంది. ఎన్ఎస్‌జీ-2 హోదా దక్కించుకొన్న రాజమండ్రి రైల్వే స్టేషనల్లో మరిన్ని మెరుగైన సదుపాయాల కల్పనకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే విజయవాడ, విశాఖలో ప్రారంభించిన ఎలక్ట్రిక్ వాహనాలు విజయవంతమయ్యాయి.

ఏజెన్సీ సమాచారం



కేక్ కటింగ్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

రంపచోడవరం, మార్చి29: తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కటింగ్ చేసి మాట్లాడారు. బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం టీడీపీ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కారం సింహాచలం, మండల ఉపాధ్యక్షుడు పూల మందేశ్వరరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వై. నిరంజనీదేవి, నాయకులు కుంజం బాపన్నదొర, బొట్టా కృష్ణ, పాకరాజు, మడి చెల్లన్న దొర, కూర రమణమ్మ, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కూటమి అభ్యర్థి మిరియాల శిరీషాదేవి

కూటమి అభ్యర్థి శిరీష ఆధ్వర్యంలో..

రంపచోడవరం, మార్చి 29: కూటమి అభ్యర్థి మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏజెన్సీలో టీడీపీ జెండాను ఎగురవేసేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్, టీడీపీ నాయకులు అడబాల బాపిరాజు, కారం సురేష్ బాబు, చవలం బాపన్నదొర, జనసేన నేత పాపోలు శ్రీను పాల్గొన్నారు.

రొట్టెలు, పండ్లు పంపిణీ



రాజవొమ్మంగి మార్చి 29: రాజవొమ్మంగి మండలంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జడ్డంగి గ్రామంలో తెలుగుదేశం నాయకులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతరావు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిలో 50 మంది రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రయాణికులకు, వ్యాపారులకు స్వీట్లు పంచారు. మాజీ జడ్పీటీసీ కోసూరి బుజ్జి చిన్నాలమ్మ, టీడీపీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, మాజీ సర్పంచ్ కోపూరి రత్నం, చెక్కా పండుబాబు, చవలా కుమార్, రేలంగి శ్రీను, గణజాల మల్లిఖార్జున, తాళాబత్తుల రాంబాబు, సాగిన చిన్నమ్ములు తదితరులు ఉన్నారు.

ఎటపాకలో..

ఎటపాక, మార్చి 29: టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎటపాకలో మండలాధ్యక్షుడు పుట్టి రమేష్, అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్వా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివార్పించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. పాటి చలపతి, కానూరి బుల్లెబ్బాయి, పెనుబల్లి సాయి, బాచినేని మల్లేశ్వరరావు పాల్గొన్నారు. నెల్లిపాకలో వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ జిల్లా నాయకులు కిలారు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జిల్లా నేతలు నలజాల శ్రీకాంత్‌చౌదరి, విస్సాపురం మాజీ ఎంపీటీసీ సూర్య నారాయణ, దండమూడి రాంబాబు, ఏలూరి వెంకన్న, మాచినేని రాజేష్ పాల్గొన్నారు.

డొంకరాయిలో ఘనంగా ఆవిర్భావ వేడుక



మోతుగూడెం, మార్చి29: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో ఎన్టీఆర్ భవనం వద్ద టీడీపీ ఎంపీటీసీ కరకా వెంకటరమణ, టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఎంపీటీసీ కరకా వెంకటరమణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలు అందరూ సమష్టిగా కలిసి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. సీనియర్ కార్యకర్తలు నీలపు సత్యనారాయణ, రత్నంరాజు, నరసింహమూర్తి, ప్రేమ్‌కిరణ్, రాము, జనసేన నేతలు కాండ్రేగుల కుమార్, కిముడు మూర్తి పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

వరరామచంద్రాపురంలో ఎన్టీఆర్‌కు ఘన నివాళి

వరరామచంద్రాపురం, మార్చి 29: టీడీపీ ఆవిర్భావ వేడుకలు మండలంలో తెలుగుతమ్ముళ్లు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, సీనియర్ నాయకులు ముత్యాల రామారావులు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సైనికునిలా పని చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు బీరక ప్రకాష్‌రావు, మత్యాల సిద్దు, సవలం రాజు, బురక సారయ్య, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న శిరీష... సాయమందిస్తున్న జమాల్‌ఖాన్

రూ. లక్ష విలువైన సామగ్రి అందజేత

చింతూరు, మార్చి 29 : మల్లెతోట అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ఆయుర్వేద నిపుణులు జమాల్‌ఖాన్ శుక్రవారం పరామర్శించారు. జెకె ట్రస్టు నేతృత్వంలో రూ.1 లక్ష విలువగల సామగ్రిని అందజేశారు. వీటిలో ఒక్కో ఇంటికిగాను ఇంటి నిర్మాణ సామగ్రి, 25 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు, దుస్తులు, దుప్పట్లు తదితర సామగ్రి ఉన్నాయి. కార్యక్రమంలో జెకె ట్రస్టు బృందం సయ్యద్ సుభాని, ఎండి ఇమ్రాన్ ఖాన్, అజీజ్ పాల్గొన్నారు. అలాగే అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను సీపీఎం బృందం శుక్రవారం పరామర్శించింది. ఒక్కో బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఇతరత్రా నిత్యావసర వస్తువులు అందజేశారు. మల్లెతోటలో గురువారం ఎనిమిది ఇళ్లు దగ్ధమై సర్వంకోల్పోయిన బాధితులను రంపచోడవరం అసెంబ్లీ నియోజక వర్గ అభ్యర్థిశిరీషాదేవి, టీడీపీ మండలాధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి, ఎంపీటీసీ జల్లి లావణ్య, నాయకులు తుర్రం చిన్నముత్తయ్య, గడ్డం సురేష్ కుమార్, శీలం తమ్మయ్య, ఆకోజు నూకాచారి, శ్రీరామమూర్తి తదితరులు పరామర్శించారు.

నల్లమిల్లిని కలిసిన నాయకులు

రాజమహేంద్రవరం సిటీ/ కొవ్వూరు, మార్చి 29: అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని టీడీపీ సీనియర్ నేత గన్నికృష్ణ, టీడీపీ కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారెడ్డి, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. అనపర్తి నియోజకవర్గాన్ని బీజేపీకి కేటాయించిన నేపథ్యంలో రామకృష్ణారెడ్డి తీవ్రనిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పార్టీపెద్దలు,సీనియర్లు నల్లమిల్లిని బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. ఇందులో భాగంగా రామకృష్ణారెడ్డిని కలిశారు.

టీడీపీ.. తెలుగు వారి ఆత్మ గౌరవం

- ఎమ్మెల్యే గోరంట్ల, జోన్-2 కోఆర్డినేటర్ రంగారావు
- ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు
- ఎన్టీఆర్‌కు నాయకుల నివాళి.. పార్టీ పతాకాల ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 29: తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే లక్ష్యంగా ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ మంత్రి జోన్-2 కో-ఆర్డినేటర్ సుజయ కృష్ణ రంగారావు అన్నారు. టీడీపీ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలుచోట్ల శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల నివాసం వద్ద కేక్ కట్‌చేసి నాయకులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో టీడీపీ పుట్టిందని, సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగు చరిత్ర చదవాలంటే టీడీపీ ఆవిర్భావానికి ముందు, ఆవిర్భావం తరువాత అని చదవాల్సిందే అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమల్లో వున్న ఫుడ్ సెక్యూరిటీ విధానాన్ని కిలో రెండు రూపాయల పథకంతో ఎప్పుడో అమలులోకి తెచ్చారన్నారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, గంగిన హనుమంతరావు, మార్ని వాసుదేవరావు, దండమూడి ప్రసాద్, మజ్జి పద్మ, ప్రమీల, యర్రమోతు ధర్మరాజు, ఆళ్ల ఆనందరావు, నున్న కృష్ణ పాల్గొన్నారు.



వడిశలేరులో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నళినికాంత్



రాజమహేంద్రవరంలో దివ్యాంగుడికి కేక్ తినిపిస్తున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలోని తిలక్‌రోడ్డులో టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ పార్టీ జెండాను ఎగురవేశారు. కేక్ కట్ చేసి నాయకులకు అందించారు. గీతా అప్సర సెంటర్‌లో నగర అధ్యక్షుడు రెడ్డి మణి, క్వారీ సెంటర్‌లో క్లస్టర్ ఇన్‌చార్జిలు కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, మూలగొయ్యి సెంటర్‌లో మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకిరామయ్య, లలితా నగర్ మెయిన్‌రోడ్డులో కంటిపూడి శ్రీనివాస్, ఆర్ట్స్ కళాశాల వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, పుష్కరాలరేవు వద్ద బుడ్డిగ రాధాల పర్యవేక్షణలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు జరిగాయి ఈ వేడుకల్లో ఆదిరెడ్డి వాసు పార్టీ జెండాలు ఆవిష్కరించి కేక్‌లు కట్ చేశారు. టీడీపీ ఆవిర్భావం ఒక చరిత్ర అన్నారు. కిలో రూ.2కే బియ్యం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలుతో టీడీపీ చరిత్ర సృష్టించిందన్నారు. స్థానిక శ్రీరామ్‌నగర్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం విభిన్నప్రతిభావంతులతో పార్టీ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ రాష్ట బీసీ సాధికార సమితి కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో బొమ్మనమైన శ్రీనివాస్, సాగి తిరుమలరావు, భాస్కర్, పి.నర్సింహులు, కోటా రమణ, కుడుపూడి గంగాధర్ పాల్గొన్నారు.



గోరంట్లకు కేక్ తినిపిస్తున్న సుజయ్ కృష్ణ రంగారావు

రంగంపేట: మండలంలోని వడిశలేరులో ఎన్టీఆర్ చిత్రపటానికి జడ్పీ వైస్ ఛైర్మన్ పెండ్యాల నళినీకాంత్ పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం టీడీపీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్టీఆర్ టీడీపీని 1982లో స్థాపించారన్నారు. కార్యక్రమంలో చావ శ్రీనివాస్, నూనె గంగారాం, ఏలూరి సత్యనారాయణ, నడిపల్లి చౌదరి, నూలు వీరన్న, చావ వీర్రాజు, ఏలూరి రాధ, చిట్టిబాబు, పాల్గొన్నారు.

భరత్‌రామ్ ప్రజాప్రతినిధిగా పనికిరాడు..

- ఇంటింటా ప్రచారంలో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 29: ప్రతి పనికి 25శాతం కమీషన్ తీసుకునే ఎంపీ భరత్‌రామ్ రాజమహేంద్రవరం ప్రజాప్రతినిధిగా పనికిరాడని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 24వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఇంటింటా ప్రచారంలో ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడారు. రాష్ట్రం బాగుపడాలన్నా, మన ప్రాంతం బాగుపడాలన్నా కూటమిని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లోనే రాజమహేంద్రవరం ప్రజలు ఎంపీ భరత్ రామ్‌పై ఉన్న వ్యతిరేకతను ఓట్ల ద్వారా చూపించారు. ఈ దఫా ఎన్నికల్లో ఆ వ్యతిరేకత మరింత ఎక్కువైందని సుమారు 50 వేల ఓట్లు మైనస్ భరత్‌కు చూపించబోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు రెడ్డి మణేశ్వరరావు, కర్రి కాశి, కర్రి సూర్యనాయుడు, బెజవాడ వెంకటస్వామి, కర్రి గాయిత్రి, గణేష్, మిధున్ పుష్పరాజ్, రాజేష్, వరలక్ష్మి, హరిశెట్టి జైన్, వసంత్, సునీల్ పాల్గొన్నారు.



ఇంటింట ప్రచారంలో ఆదిరెడ్డి శ్రీనివాస్

ఇఫ్తార్ విందుకు హాజరు.. రాజమహేంద్రవరం జెండా పంజారోడ్డులోని మర్గస్ మసీదులో శుక్రవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందుకు ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొని ఇఫ్తార్ విందు స్వీకరించారు.

గుడ్‌ఫ్రైడే వేడుకలు



రాజమహేంద్రవరంలో శాంతి ర్యాలీ చేస్తున్న దహించు అగ్ని మినిస్ట్రీస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 29: రాజమహేంద్రవరంలోని క్రైస్తవప్రార్థన మందిరాల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నగరంలో లూథర్ గిరి చర్చి, బ్రదర్ చర్చి, క్రైస్ట్ వర్షిప్ చర్చి, సీయోను ప్రార్థనా మందిరం, ఆర్‌సీఎం చర్చి, హోలీట్రినిటీ చర్చి, సెయింట్ పీటర్స్ చర్చి, సెయింట్ పాల్ చర్చి, దహించు అగ్ని మినిస్ట్రీస్, చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ప్రార్థనా మందిరాల్లో శుక్రవారం ఉదయం నుంచి ప్రార్థనలు చేశారు. 40 రోజులపాటు నిర్వహించే శ్రమదినాల్లో పరిశుద్ధ శుక్రవారానికి ప్రత్యేక స్థానం ఉంది. ఏసు శిలువ మోసిన రోజును క్రైస్తవులు పరిశుద్ధ దినంగా జరుపుకుని ఉపవాస ప్రార్థనలు చేస్తారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రార్థనలు జరిగాయి. అనంతరం కొన్ని చర్చి సంఘాలు శాంతి ర్యాలీలు చేశాయి. రాజమహేంద్రవరంలో దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బిషప్ థామస్ భారీ శాంతి ర్యాలీని పురవీధుల్లో నిర్వహించారు. ఆర్యాపురం దహించు అగ్ని ప్రార్థనా మందిరం నుంచి తుమ్మలోవ, రామచంద్రరావు పేట, దేవిచౌక్, గోకవరం బస్టాండ్, మునిసిపల్ కార్యాలయం మీదుగా తిరిగి ప్రార్థన మందిరానికి ర్యాలీ చేశారు.

కడియం: మండలంలోని దామిరెడ్డిపల్లిలో బైబిల్‌మిషన్ మహిమ మందిరంలో పాస్టర్ డి.రతన్‌రాజు ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు జరిగాయి. డి.స్వాతి, కళ్యాణి ఫ్రాన్సిస్, కొండేటి సునీల్‌కుమార్ బైబిల్‌లోని వాక్యాలు చదివి వినిపించారు. ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మగ్గం లక్ష్మి, సంపర రాణి, కొండేటి ప్రసాద్, పందిరి రాజు, పాదూరి ప్రవీణ్ పాల్గొన్నారు.

ముసలమ్మ తల్లికి లక్ష పుష్పార్చన



అమ్మవారి పుష్పాలంకరణకు తీసుకొచ్చిన పువ్వులు

కడియం, మార్చి 29: కడియపులంక ముసలమ్మ తల్లి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా మూడో రోజు శుక్రవారం కావడంతో కొత్తపల్లి సత్తిరాజు-సత్యవతి దంపతులు, సత్యదేవానర్సరీ సంయుక్త సహకారంతో లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. రకానికి 108 పూలు చొప్పున 108 రకాల పూలతో అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

జీవకారుణ్య సంఘం ఆస్తులు కాపాడాలి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28: దాత ఆశయాలకు విరుద్ధంగా రాజమహేంద్రవరం గౌతమి జీవకారుణ్య సంఘం ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తన తండ్రి కనికిరెడ్డి జ్ఞాపకార్థం గౌతమీ జీవకారుణ్య సంఘంలోని వృద్ధులకు విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం అన్నదాన వితరణ చేశారు. 40 ఏళ్ల కిందట మట్టే నారాయణమ్మ అనే దాత గౌతమీ జీవకారుణ్య సంఘానికి 19.7 ఎకరాల స్థలాన్ని దానం చేశారని, ఆస్తులన్నీ వృద్ధాశ్రమం సంస్థకే చెందాలని దాత వీలు రాశారని తెలిపారు. దీన్ని పట్టించుకోకుండా ఆర్టీవో కార్యాలయానికి మూడు ఎకరాలు, గోరక్షణ సంఘానికి మూడు ఎకరాలు, దేవాదాయశాఖ డీసీ ఆఫీస్, గెస్ట్‌హౌస్, ఆలయానికి రెండు ఎకరాల స్థలాన్ని ఇచ్చారని అన్నారు. కోట్లాది రూపాయల విలువైన ఈ భూములను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నించడం దారుణమన్నారు.

జనసైనికులంతా నా వెంటే

ఆత్మీయ సమావేశాల్లో జ్యోతుల నెహ్రూ



రంపయర్రంపాలెంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న జ్యోతుల నెహ్రూ

గోకవరం, మార్చి 29: నియోజకవర్గంలోని అసలైన జనసైనికులంతా తన వెంటే ఉన్నారని జగ్గంపేట టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెం, గంగంపాలెం, రంపయర్రంపాలెం, పెంటపల్లి, వీరలింకపల్లి, అచ్యుతాపురం, గుమ్మళ్ళదొడ్డి, ఇటికాయిలపల్లి, గాదెలపాలెం, తంటికొండ, కృష్ణునిపాలెం గ్రామాల్లోని జనసేన నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెహ్రూ మాట్లాడుతూ పొత్తు ధర్మంలో భాగంగా నియోజకవర్గంలో ప్రతి జనసైనికుడిని ఆత్మీయంగా కలుస్తున్నానని, నాలుగు మండలాల జనసేన కన్వీనర్లు తనతో కలిసి నడవడం పొత్తు ధర్మానికి శుభసూచకమన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేయడం కూడా తన గెలుపుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కూటమి నాయకులు సమన్వయంతో పనిచేయాలి

- టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి వెంకటరమణచౌదరి
- పలు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు

కోరుకొండ, మార్చి 29: బొడ్డు వెంకటరమణచౌదరి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను గ్రామస్థాయి నాయకులను కలుపుకుని వెళ్లాలని, సమన్వయంతో పని చేసి ఒక ఓటు పురందేశ్వరికి, మరో ఓటు బత్తుల బలరామకృష్ణకు వేయించి గెలిపించుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులను ఒకతాటిపై తీసుకొచ్చేందుకు గ్రామస్థాయిలో సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బీవీఆర్ చౌదరి, జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం కోరుకొండ మండలంలోని కోటికేశవరం, రాఘవాపురం, బొల్లేద్దుపాలెం, గరగలంపాలెం, కోటి, శ్రీరంగపట్నం గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో ఎన్నికలకు సంబంధించి పొత్తు ధర్మాన్ని పాటిస్తూ ఏ విధంగా ముందుకు వెళ్లాలో చర్చించారు. సమావేశంలో టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, అడపా వీరబాబు, రాఘవాపురం సర్పంచ్ ఉండ్రు సంధ్యారాణి, కోటి సర్పంచ్ వెంటపాటి దుర్గారావు, కేశవరం సర్పంచ్ ఎం.సింధు దివ్య, బొల్లేద్దుపాలెం సర్పంచ్ బుజ్జి, గరగలంపాలెం సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పోటాపోటీగా ప్రచారాలు.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, అటు వైసీపీ నాయకులు గ్రామస్థాయిలో శుక్రవారం నుంచి పోటాపోటీగా ఇంటింటా ప్రచారానికి తెరలేపారు. రానున్న ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు ప్రజలకు చేరవేస్తూ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో కూటమి నాయకులు ప్రచారం చేస్తున్నారు. దీనిలో భాగంగా నిడిగట్లలో గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థిని గెలిపించాలంటూ జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ప్రచారం చేశారు. అలాగే జంబుపట్నంలో ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి, సర్పంచ్ వుల్లి అప్పన్నదొర ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మూడు పార్టీ నాయకులు

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు

చాగల్లు, మార్చి 29: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మూడు పార్టీల శ్రేణులు ఐకమత్యంతో పనిచేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు అన్నారు. మండలంలోని కలవలపల్లి, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల గ్రామాల్లో జరిగిన కార్యకర్తల సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అవినీతి, అక్రమాలతో సాగుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటు కోసం అందరు అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుల గెలుపు కోసం అందరు కృషిచేయాలన్నారు. సమావేశాల్లో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, నాదెళ్ళ శ్రీరామ్, దొంగ రామకృష్ణ, గారపాటి బాబురావు, పత్తిపాటి వెంకటేశ్వరరావు, నందిగం హరినాథ్, జనసేన నాయకులు గాయత్రి వెంకటేశ్వరరావు, కొప్పాక విజయకుమార్ పాల్గొన్నారు.

దుర్గేష్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి

ఉండ్రాజవరం, మార్చి 29: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కోరారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలను కందుల దుర్గేష్ పరిచయం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉండ్రాజవరంలో జరిగిన సమావేశంలో శేషారావు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో దుర్గేష్‌ను గెలిపించుకోవాలన్నారు. దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ప్రతి ఒక్కరూ తన గెలుపునకు కృషి చేయాలన్నారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి, మాజీ ఎంపీపీ గన్నమని శేషారావు చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బోగవల్లి ప్రసాద్, మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నాయకులు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, కుదప చక్రపాణి, రాచమళ్ల శ్రీనివాసరావు, నార్గని వెంకట్రావు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ వేడుకలు



కోరుకొండ, మార్చి 29: టీడీపీ ఆవిర్భావ వేడుకులను మండలంలోని బూరుగుపూడి గేటు వద్ద పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, అడపావీరబాబు, మార్ని వీరాంజనేయులు, మాదబోయిన అప్పారావు, టీవీవీఎస్ నారాయణ, బత్తుల బాబురావు నాయుడు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన బీవీఆర్ చౌదరి



కోరుకొండ, మార్చి 29: రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరిని శుక్రవారం విజయవాడలో రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సంపూర్ణ మద్దతు ఆమెకు తెలియజేశారు. అంతకు ముందు పురందేశ్వరికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.

కడియంలో చలివేంద్రం ఏర్పాటు

కడియం, మార్చి 29: కడియంలో డీఎస్ఆర్ వెజిటబుల్స్ దొడ్డా శ్రీను పేరిట వారి కుటుంబసభ్యులు దొడ్డా బాబి, దొడ్డా తాతాజీ శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు, బాధ్యత సేవాసంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో దొడ్డా బుజ్జి, గిరజాల నాగేశ్వరరావు, ముమ్మిడి ప్రసాద్, మర్రి చంద్రరావు, ఆర్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.


సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ది గోట్ లైఫ్
సూర్యామినీ	: క్రూ
సూర్యాప్యాలస్	: గాడ్జిల్లా అండ్ కాంగ్
స్వామి	: టిల్లు స్క్వేర్
శివజ్యోతి	: ఓం బీం బుష్
అనుశ్రీ(సాయికృష్ణ)	: గాడ్జిల్లా అండ్ కాంగ్
రాజా	: గాడ్జిల్లా అండ్ కాంగ్
ఊర్వశి	: కలియుగం, ప్రేమలు
రంభ	: గాడ్జిల్లా అండ్ కాంగ్
మేనక	: భీమా
అప్సర	: టిల్లు స్క్వేర్
కుమారి	: టిల్లు స్క్వేర్
వీఎస్ మహల్(నామవరం)	: టిల్లు స్క్వేర్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: టిల్లు స్క్వేర్
వెంకటసూర్య(కడియం)	: గాడ్జిల్లా అండ్ కాంగ్
సత్యగౌరి (అనపర్తి)	: భీమా
సూర్యశ్రీ (అనపర్తి)	: టిల్లు స్క్వేర్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: టిల్లు స్క్వేర్
రామకృష్ణ(కోరుకొండ)	: టిల్లు స్క్వేర్
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఓం బీం బుష్
శ్రీనివాస (గోకవరం)	: టిల్లు స్క్వేర్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓం బీం బుష్
లలితామహల్(రంపచోడవరం)	: టిల్లు స్క్వేర్
నవయుగ(చింతూరు)	: ------

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని) సా.6.25

సహారి(ఆది) ఉ.4.37

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.0	24.0

జయహో టీడీపీ





టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రాల్లో నాయకులు కేకులు కట్ చేసి పండుగలా చేసుకున్నారు.. కార్యకర్తలు జై టీడీపీ..జయహో టీడీపీ అంటూ నినాదాలతో హోరెత్తించారు.. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎన్‌టీఆర్ విగ్రహాలకు ముసుగులు వేశారు. ఈ నేపథ్యంలో ఎన్‌టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి వాసు పుష్కర ఘాట్ వద్ద కేక్ కట్ చేశారు. కొవ్వూరు టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు కూటమి విజయం సాధించాలంటూ గౌరీపట్నంలో శిలువ మోసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. - వివరాలు 8లో

ఏసయ్యా..రావయ్యా!





గుడ్‌ఫ్రైడే వేడుకలు జిల్లా వ్యాప్తంగా వేడుకగా నిర్వహించారు. క్రైస్తవులు శిలువ మోస్తూ భారీ ర్యాలీ చేశారు..పాపుల రక్షణార్థం నీ ప్రాణాలర్పించావా కరుణామయుడా అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఏసయ్యా మళ్లీ మా చెంతకు రావయ్యా అంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చర్చిలలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రేమ విందు చేసి ఉపవాస దీక్షలు విరమించారు. రాజమహేంద్రవరంలో పలువురు విశ్వాసులు తెల్ల దుస్తులు ధరించి.. సిలువ పట్టుకుని.. క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ ర్యాలీ చేశారు. - వివరాలు 8లో

జనసేనాని శ్రీకారం



- జనసేన అధినేత పవన్ రాక నేడే
- పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారానికి ఏర్పాట్లు
- నాలుగురోజులపాటు నియోజకవర్గంలో ఉండడనున్న పవన్
- నేడు మధ్యాహ్నం 12.30గంటలకు గొల్లప్రోలుకు హెలీకాప్టర్‌లో రాక
- పాదగయలో వారాహి వాహనానికి పూజలు
- అనంతరం దత్తపీఠం సందర్శన: అక్కడినుంచి వర్మ ఇంటికి పయనం
- సాయంత్రం చేబ్రోలులో బహిరంగ సభలో ప్రసంగించనున్న పవన్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/పిఠాపురం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తూర్పుగోదావరి జిల్లా గడ్డ నుంచి అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. అధికార వైసీపీ ఓటమే లక్ష్యంగా తన ఎన్నికల వ్యూహాన్ని ఉమ్మడి జిల్లానుంచే మొదలుపెట్టనున్నారు. తాను పోటీచేస్తున్న పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం వేదికగా అసలు సిసలు ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. అమ్మవారి ఆశీస్సులతో వారాహి వాహనమెక్కి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి జనాశీర్వాదం అందించాలని పిలుపునివ్వనున్నారు. ప్రజావ్యతిరేక జగన్ ప్రభుత్వానికి చెల్లు చీటి పడేలా చేయాలని ప్రజలకు పిలుపునివ్వనున్నారు. వాస్తవానికి త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ పిఠాపురం గడ్డనుంచే ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు ఇప్పటికే పవన్ స్వయంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో పిఠాపురంనుంచి అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని పవన్ శనివారంనుంచి ప్రారంభించబోతున్నారు. దీంతో పిఠాపురం నియోజకవర్గాన్ని ఎంచుకోవడానికిగల కారణాలు, తనను గెలిపిస్తే నియోజకవర్గ రూపురేఖలు ఎలా మారుస్తాననే దానిపై పవన్ తన ఎన్నికల ప్రచార పర్యటనలో ప్రజలకు వివరించనున్నారు. తనను ఓడించడానికి పిఠాపురంలో అధికార వైసీపీ పన్నుతున్న కుయుక్తులను సైతం తన పర్యటనలో ప్రస్తావించనున్నారు. ఈ నేపథ్యంలో పవన్ పిఠాపురంలో తొలి ఎన్నికల ప్రచార పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి పిఠాపురంలో పవన్ పర్యటనపైనే నెలకొంది. శనివారంనుంచి పవన్ మొత్తం నాలుగు రోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు.

నేటి పర్యటన ఇలా..

తొలిరోజు శనివారం మధ్యాహ్నం 12.30గంటలకు గొల్లప్రోలులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని హెలీప్యాడ్‌లో పవన్ దిగనున్నారు. అక్కడినుంచి నేరుగా పిఠాపురంలోని పాదగయ క్షేత్రానికి చేరుకుని పుర్హూతికా అమ్మవారికి పూజలు చేస్తారు. అక్కడే వారాహి వాహనానికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం దత్త పీఠాన్ని సందర్శిస్తారు. అక్కడినుంచి దొంతమూరులో టీడీపీ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్మ నివాసానికి వెళ్లి ఆయన్ను పలకరిస్తారు. అక్కడినుంచి కుమారపురంలోని ఓ ప్రైవేటు అతిథిగృహంలో బసకు వెళ్తారు. తిరిగి చేబ్రోలులోని రామాలయం సెంటర్‌లో సాయంత్రం 4.30గంటల నుంచి 6.30 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తిరిగి బసకు వెళ్తారు. కాగా ఆదివారం నాటి షెడ్యూల్‌పై శనివారం రాత్రికి స్పష్టత రానుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలిసికట్టుగా ఎన్నికలకు వెళ్తున్న నేపథ్యంలో బహిరంగ సభల్లో పవన్‌తోపాటు వారాహి వాహనంపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మతోపాటు బీజేపీ నేతలు కూడా ఎక్కనున్నారు. పవన్ పిఠాపురంనుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆయనకు ఎన్నికల్లో సహకరించేందుకు అనేక జిల్లాలనుంచి నేతలు పిఠాపురానికి చేరుకున్నారు. ఎన్నికలయ్యే వరకు వారంతా ఇక్కడే ఉండి పనిచేయనున్నారు. హైదరాబాద్‌నుంచి పలువురు స్కేటర్స్ తరలివచ్చారు. వీరంతా సింగిల్ వీల్ వాహనంపై తిరుగుతూ నియోజకవర్గంలో ప్రచారం చేయనున్నారు. తెలంగాణ, బెంగళూరు, పూణే నుంచి పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పవన్ ప్రచారంలో పాల్గొననున్నారు. కాగా నియోజకవర్గంలో నాలుగురోజుల పర్యటనలో పవన్ వివిధ వర్గాలతో సమావేశం కానున్నారు. ఉప్పాడ మత్స్యకారులు, చేనేతలు, మేధావులు, వ్యాపారులు తదితరులతో సమావేశమై పిఠాపురం నియోజకవర్గానికి భవిష్యత్తులో ఏమేం చేయాలి? ఎలాంటి సమస్యలున్నాయి? వంటి అంశాలపై చర్చించి ప్రత్యేక అజెండా కూడా ప్రకటించే అవకాశం ఉంది. మరోపక్క ఈనెల 2న తర్వాత వపన్ ఇతర జిల్లాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లనున్నారు.

మలి విడతలో..

కాకినాడ రూరల్ నియోజకవర్గానికి ఏప్రిల్ 8న రానునారు. ఆరోజు సాయంత్రం బహిరంగసభలో ప్రసంగిస్తారు. అనంతరం ఏప్రిల్ 9న పిఠాపురంలో ఉగాది వేడుకల్లో పాల్గొననున్నారు. ఆ తర్వాత 10న కోనసీమ జిల్లా రాజోలు, 11న పి.గన్నవరం, 12న తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. దీనికి వారాహి విజయభేరి బహిరంగ సభగా నామకరణం చేశారు. మరోపక్క పవన్ పిఠాపురంలో పోటీచేస్తున్న నేపథ్యంలో ఇప్పటికే అధికార వైసీపీ భారీగా మోహరించింది. కోట్లలో నగదు పంపిణీ, వివిధ వర్గాలను, వారి ఓట్లను కొనుగోలు చేయడానికి పెద్దఎత్తున అడ్డదారి వ్యూహాలు అమలుచేస్తోంది. నియోజకవర్గంలో మండలాలను మూడు ముక్కలు చేసి ముగ్గురు కీలక నేతలకు అప్పగించి వారి ద్వారా చెరో రూ.50కోట్ల చొప్పున ఖర్చుచేయిస్తోంది. డబ్బుల పంపకం, దొంగ ఓట్లు వేయడానికి వీలుగా ఏకంగా కడప నుంచి బృందాలను తరలిస్తోంది. వీరికోసం నియోజకవర్గంలో అద్దె ఇళ్లు కూడా తీసింది. ఈ కుయుక్తులను పసిగట్టిన జనసేనాధిపతి వైసీపీ అడ్డగోలు వ్యూహాలపై ధ్వజమెత్తారు. తనను ఓడించడానికి వైసీపీ పిఠాపురంలో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఇవ్వడానికి సిద్ధంగా ఉందని నిప్పులు కక్కారు. ఈ నేపథ్యంలో పవన్ ఎన్నికల ప్రచారం, వైసీపీ ఎన్నికల వ్యూహాలతో పిఠాపురం రాజకీయాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

కౌలు రైతు ఆత్మహత్య

చాగల్లు, మార్చి 29: అప్పుల బాధ తాళలేక చాగల్లుకు చెందిన కౌలు రైతు బత్తిన శ్రీనివాస్(45) ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ పి.నాగరాజు శుక్రవారం తెలిపారు. శ్రీనివాస్ వ్యవసాయ కూలి.ఎకరం పొలం కౌలుకు తీసుకున్నాడు.కుటుంబ అవసరాలకు ఏడాది కిందట రూ.4 లక్షలు అప్పు చేశాడు. అందులో రూ.2 లక్షలు ప్రతి వారం వాయిదా రూ.3 వేలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నాడు. అయితే రెండు వారాల కిందట పొలంలో పనిచేస్తుండగా పడిపోవడంతో చేతికి బలంగా గాయమైంది. దీంతో పనులకు వెళ్లలేక ఇంటి వద్దనే ఉండి వైద్యం చేయించుకుంటున్నాడు. దీంతో ప్రతి వారం చెల్లించే వాయిదాల సొమ్ము చెల్లించకపోవడంతో అప్పు తీసుకున్న వారి నుంచి ఒత్తిడి మొదలైంది. దీంతో మనస్తాపం చెంది గురువారం తన ఇంటిలోనే కలుపు మందు తాగినట్టు కుటుంబీకులు తెలిపారు. వైద్యం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

అనపర్తిలో అదే పట్టు!



న్యాయం కావాలి : అనపర్తి మండలం మహేంద్రవాడలో కుటుంబీకులతో కలిసి నల్లమిల్లి పర్యటన

ఇంకనూ పట్టువీడని నల్లమిల్లి

- మహేంద్రవాడలో ప్రజాభిప్రాయ సేకరణ
- ఐదు రోజుల పాటు కుటుంబంతో పర్యటన
- కలిసిన ఐదుగురు బృందం సభ్యులు
- అధినేతను కలవాలన్న విన్నపం తిరస్కరణ
- న్యాయం చేయాలని డిమాండ్

అనపర్తి, మార్చి 29 : అనపర్తిలో అసమ్మతి సెగలు చల్లారలేదు. తొలిజాబితాలో టీడీపీ జనసేన అనపర్తి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించి ఇప్పుడు బీజేపీ అభ్యర్థికి అనపర్తి సీటును కేటాయించడం పట్ల టీడీపీ కార్యకర్తల్లో అసహనం రోజు రోజుకు పెరుగుతుంది. టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం నల్ల మిల్లి రామకృష్ణారెడ్డితో ఫోన్‌లో మాట్లాడినా ఆందోళన సద్దుమణగలేదు.ఈ మేరకు టీడీపీ అధిష్ఠానం ఐదుగురు సీనియర్ నాయకుల బృందం గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, సుజయ్ కృష్ణ రంగారావు, గన్ని కృష్ణలను రామవరం గ్రామంలోని నల్లమిల్లి నివాసానికి శుక్రవారం పంపారు. నల్లమిల్లి మూలారెడ్డి సతీమణి రామకృష్ణారెడ్డి మాతృమూర్తి సత్యవతి మాట్లాడుతూ మూలారెడ్డి అనారోగ్యంతో ఉన్నపుడు పరామర్శకు వచ్చిన చంద్రబాబు మీ కుటుంబానికి అండగా ఉంటానని మాట ఇచ్చారని.. ఇప్పుడు తమ కుటుంబానికి చేసిందేమిటని ప్రశ్నించారు. 42 ఏళ్లుగా పార్టీని నమ్ముకుని అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేసిన తమ కుటుంబానికి ఇలా చేయడం సమంజసమా అన్నారు. దీనిపై బృందం నాయకులు మౌనం వహించారు. అనంతరం నల్లమిల్లితో మాట్లాడుతూ విజయవాడ వచ్చి అధినేత చంద్రబాబుతో మాట్లాడాలని సూచించారు. అయితే తాను ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ఐదు రోజుల పాటు కుటుంబంతో కలిసి నియోజకవర్గంలో పర్యటిస్తానని మాటిచ్చానని తాను ప్రస్తుతం కలవలేనని వారి ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించారు. అనంతరం నల్లమిల్లి ఇంటి నుంచి బయటకు వస్తున్న నాయకుల బృందాన్ని టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. తమ నాయకుడు చేసిన తప్పేమిటో తేల్చి చెప్పాలని భైఠాయించారు. నియోజకవర్గంలో ఎన్‌డీఏ అభ్యర్థిగా బలంలేని వ్యక్తిని నిలపడం ద్వారా ఇటు అనపర్తి అసెంబ్లీ సీటు, రాజమండ్రి పార్లమెంట్ సీటు ఓడిపోయే ప్రమాదం ఉందని అధినేతలకు తెలియదా అంటూ ప్రశ్నించారు. కార్యకర్తలనుద్దేశించి బృందంలోని బుచ్చయ్య చౌదరి, సుజయ కృష్ణ రంగారావు కార్యకర్తలను వారించే ప్రయత్నం చేశారు. అనపర్తి నియోజకవర్గంలో టీడీపీ బలహీనపడితే వచ్చే నష్టాలు తమకు తెలుసునని దీనిని అధినేత దృష్టికి తీసుకు వెళ్లామని.. ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరామన్నారు.ఒకటి రెండు రోజుల్లో మంచి ప్రకటన వస్తుందన్న నమ్మకంతో తామంతా ఉన్నామన్నారు.

మహేంద్రవాడలో ప్రజాభిప్రాయ సేకరణ

అనపర్తిలో తెలుగుదేశం పార్టీ ఉనికిని లేకుండా చేయాలని కొంత మంది పన్నిన కుట్ర లో మూడు పార్టీల నేతలు తిప్పికొట్టాలని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి సీటు ఇవ్వకపోవడంపై శుక్రవారం తన మాతృమూర్తి నల్లమిల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, కుమారుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ సనా తనితో కలిసి శుక్రవారం అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కుటుంబంతో సహా వారంతా ఇంటింటికి వెళ్లి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న నల్లమిల్లి మూలా రెడ్డి సతీమణి కొద్ది దూరం నడచినప్పటికీ వయసు సహకరించకపోవడంతో ఆమెను రిక్షాలో కూర్చుండబెట్టి పర్యటించారు. తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంచారు. మూడు పార్టీల అధినేతలు సీటు మార్పుపై పునరాలోచన చేయాలన్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించేందుకే కుటుంబం అంతా పర్యటిస్తున్నామన్నారు. బిక్కవోలు మండలం పందలపాకలో శనివారం పర్యటిస్తానన్నారు.



టీడీపీ అధిష్ఠానం పంపిన బృందం సభ్యుల ఎదుట ఆవేదన వెలిబుచ్చుతున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తల్లి సత్యవతి

5 నుంచి బరిలోకి..

- పార్లమెంట్‌లో ప్రచారానికి పురందేశ్వరి?
- పరిస్థితులపై ఆరా తీస్తున్న భర్త దగ్గుబాటి
- పాత పరిచయస్తులతో మంతనాలు
- స్థానిక నేతలతో సమన్వయం
- కలిసిన పలువురు నేతలు
- కూటమిలో మరింత జోష్



దగ్గుబాటి వెంకటేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదిరెడ్డి అప్పారావు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేరు ఖరారు కావడంతో కూటమిలో జోష్ పెరిగింది. వచ్చే నెల 5వ తేదీ నుంచి ఆమె పూర్తిగా రంగంలోకి దిగనున్నట్టు సమాచారం. ఆ రోజు నుంచి రాజమహేంద్రవరంలోనే ఆమె ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.లోక్‌సభ పరిధిలోని ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి(చిన వెంకన్న) ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభిస్తారనే సమాచారం ఉంది. దీనిని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.ఆమె ఎన్‌టీఆర్ కుమార్తె కావడం, టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి స్వయానా సోదరి కావడంతో కూటమిలో మరింత జోష్ కనిపిస్తోంది. ఆమె తరపున పురందేశ్వరి భర్త మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రంగంలోకి దిగారు.రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో శుక్రవారం బస చేసి జిల్లాలో తనకు ఉన్న పరిచయాలతో నాయకులు, కేడర్‌తో సమన్వయం చేసుకునే పని మొదలు పెట్టినట్టు సమాచారం. అంతే కాకుండా పాత పరిచయస్తులతోనూ మంతనాలు సాగించారు. ఆయనను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు,టీడీపీ శెట్టిబలిజసాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు మర్యాద పూర్వకంగా కలిసినట్టు సమాచారం. దీనిలో భాగంగా జిల్లాలో రాజకీయ పరిస్థితులపై ఆరా తీసినట్టు సమాచారం.రాజకీయంగా కలిసివచ్చే అంశాలు.. కలిసిరాని అంశాలపై చర్చించినట్టు తెలిసింది.

టీడీపీకి కంచుకోట..

తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్ సభ ఎన్నికల్లో టీడీపీ మూడు సార్లు, బిజెపి రెండుసార్లు, కాంగ్రెస్ నాలుగు సార్లు, వైసీపీ ఒకసారి గెలిచింది. కానీ గెలిచిన ప్రతి సారీ మెజార్టీ ఓట్ల శాతం పరిశీలించినా టీడీపీ అధికంగా ఓట్లు తెచ్చు కోవడం గమనార్హం. ఇక జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుతం అనపర్తి నియోజకవర్గంలో సమస్య ఉంది. మిగతా చోట్ల బలమైన అభ్యర్థులు రంగంలో ఉన్నారు. అనపర్తి సమస్య పరిష్కారమైతే మరింత సాఫీగా ముందుకు వెళ్లవచ్చు. అక్కడ టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి తొలిజాబితాలోనే టీడీపీ టికెట్ ఖరారు చేసింది. కానీ తర్వాత పొత్తుల వల్ల బీజేపీ ఈ సీటు తీసుకుంది.రామకృష్ణారెడ్డి బలమైన అభ్యర్థి. పైగా ఇక్కడ 1978 నుంచి రెడ్డి సామాజికవర్గం నుంచే ఎమ్మెల్యేలు ఎన్నిక వుతున్నారు. ప్రధాన పార్టీలు ఈవర్గం నేతలకే టికెట్లు ఇస్తుంటారు. అనూహ్యంగా ఈసారి బీజేపీ రెడ్డియేతర సామాజికవర్గం క్షత్రియ వర్గానికి చెందిన ఎం.శివకృష్ణంరాజుకు సీటు ఇచ్చింది.ఈ నియోజక వర్గంలో అసమ్మతి సెగలు చల్లారవలసి ఉంది. ప్రజాస్వామ్యంలో ఒక నియోజక వర్గం ఒకే వర్గానికి రాసిచ్చేయలేం. కానీ రాజకీయ పార్టీలకు గెలుపుఓటముల అంచనా ముఖ్యం.

ఎన్నికల ఏర్పాట్లపై ఆరా



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం జిల్లాలో పర్యటించారు.. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశారు. లోటుపాట్లు తెలుసుకున్నారు. గొడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. కలెక్టర్ మాధవీలత నమూనా ఈవీఎంను తీసి చూపించారు. భద్రత చర్యలపై ఆరా తీశారు. భద్రత ఏర్పాట్లను ఎస్పీ జగదీశ్ వివరించారు. - వివరాలు 8లో

మండుతున్న భానుడు

40 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 29: మార్చి నెలాఖరుకే ఎండలు మండిపోతున్నాయి. ఇక ఏప్రిల్ నెలలో ఎండలు మరింత తీవ్రస్థాయిలో ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. వాస్తవానికి మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రత ఉంటుంది. కానీ మార్చి నెలాఖరు 25వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. గరిష్ఠం 38.0, 39.0, 40.0 డిగ్రీల వరకు నమోదయ్యాయి. కనిష్ఠం 21.0, 22.0, 23.0, 24.0 డిగ్రీలుగా నమోదయ్యాయి. శుక్రవారం గరిష్ఠంగా 40.0 కనిష్ఠంగా 24.0 డిగ్రీలుగా ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలకు వేడి గాలులు వీయడం ప్రారంభమైంది. నగరంలో బయట తిరిగే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఉక్కబోత ఆరంభం కావడంతో ఆపసోపాలు పడుతున్నారు.దీంతో ఉదయం,సాయంత్రం వేళ పనులు ముగించుకుంటున్నారు.మధ్యాహ్నం రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.వచ్చే నెల ఆరంభంలోనే ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరే అవకాశాలున్నాయి. దీంతో ప్రజలు ఇప్పటి నుంచే భయపడుతున్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు



బ్రాహ్మణగూడెంలో టీడీపీ శ్రేణులతో అచ్చిబాబు

చాగల్లు, మార్చి 29: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మూడు పార్టీల శ్రేణులు ఐకమత్యంతో పనిచేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు అన్నారు. మండలంలోని కలవలపల్లి, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల గ్రామాల్లో జరిగిన కార్యకర్తల సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అవినీతి, అక్రమాలతో సాగుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటు కోసం అందరు అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుల గెలుపు కోసం అందరు కృషిచేయాలన్నారు. సమావేశాల్లో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, నాదెళ్ళ శ్రీరామ్, దొంగ రామకృష్ణ, గారపాటి బాబురావు, పత్తిపాటి వెంకటేశ్వరరావు, నందిగం హరినాథ్, జనసేన నాయకులు గాయత్రి వెంకటేశ్వరరావు, కొప్పాక విజయకుమార్, ఉప్పులూరి బాబురావు పాల్గొన్నారు.

పాడి పశువుల్లో వ్యాధులపై అవగాహన అవసరం

పశువుల్లో ప్రథమ చికిత్సపై కేవీకేలో ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న కేవీకే హెడ్ నాయుడు, ఆత్మ పీడీ జ్యోతిర్మయి

రాజానగరం, మార్చి 29: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పాడి పశువుల్లో సంక్రమించే వ్యాధులపై అవగాహన ఉండాలని కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు సూచించారు. పశువుల్లో ప్రథమ చికిత్స, యాజమాన్యంపై గ్రామీణ యువతకు కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో వారం రోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఆత్మ తూర్పుగోదావరి జిల్లా సౌజన్యంతో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాడి పశువుల పోషణ, యాజమాన్యం, టీకాలు, పశుగ్రాసం రకాలు, సాగు, పాల దిగుబడికి పాటించాల్సిన అంశాలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పశువుల్లో సంక్రమించే వ్యాధులు, నివారణ, ముఖ్యంగా పొదుగువ్యాధి (మాస్టయిటీస్)గుర్తింపు, చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ, ప్రదర్శన నిర్వహించారు. రాజానగరం, సీతానగరం, గోకవరం, కోరుకొండ, గోపాలపురం, మండపేట, ఆలమూరు, అడ్డతీగల, పెద్దాపురం, గంగవరం, గండేపల్లి మండలాలకు చెందిన ఔత్సాహిక గ్రామీణ యువతీయువకులకు కేవీకే రిటైర్డ్ వైద్యులు డాక్టర్ పీవీఎస్ శివరావు, డాక్టర్ బి.జాన్‌బాబు పశువుల్లో ప్రథమ చికిత్స పోషణ యాజమాన్యంపై శిక్షణ, అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, పశువులకు అత్యవసర చికిత్సకు సంబంధించిన ప్రథమ చికిత్స కిట్లు అందజేశారు. ఈకార్యక్రమం నిర్వహణకు ప్రోత్సహించిన ఐకార్-సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్‌కు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ తూర్పుగోదావరి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గేష్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి



ఉండ్రాజవరం సమావేశంలో మాట్లాడుతున్న శేషారావు

ఉండ్రాజవరం, మార్చి 29: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కోరారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలను కందుల దుర్గేష్ పరిచయం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉండ్రాజవరంలో జరిగిన సమావేశంలో శేషారావు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో దుర్గేష్‌ను గెలిపించుకోవాలన్నారు. దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ప్రతి ఒక్కరూ తన గెలుపునకు కృషి చేయాలన్నారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి, మాజీ ఎంపీపీ గన్నమని శేషారావు చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బోగవల్లి ప్రసాద్, మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నాయకులు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, కుడప చక్రపాణి, రాచమళ్ల శ్రీనివాసరావు, నార్గని వెంకట్రావు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానంపై అవగాహన

ఉండ్రాజవరం, మార్చి 29: క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య అందించడమే తమ లక్ష్యమని వేలివెన్ను శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. శుక్రవారం వేలివెన్నులోని శశి క్యాంపస్‌లో నూతన జాతీయ విద్యా విధానం, సీబీఎస్ఈ కోర్సుపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ విద్యావిధానంలో అనేక మార్పులు జరిగాయని, వాటికి అనుగుణంగా తమ క్యాంపస్‌లో విద్యాప్రణాళికలో మార్పుల చేశామన్నారు. అకడమిక్ డైరెక్టర్లు చిట్టూరి శేషుబాబు, మన్నె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంటర్‌లో నేర్చుకున్న సబ్జెక్టు ద్వారానే పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శశి అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డిని కలిసిన ద్విసభ్య కమిటీ

కొవ్వూరు, మార్చి 29: అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని టీడీపీ కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారెడ్డి, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి శుక్రవారం ఆయన నివాంలో కలిశారు. అనపర్తి టిక్కెట్టును పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించారు. దీంతో మనస్తాపం చెందిన రామకృష్ణారెడ్డితో టీడీపీ నాయకులు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ద్విసభ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో ఎలక్ట్రిక్ వాహనాలు

మరి కొద్ది రోజుల్లో అందుబాటులోకి..



రాజమహేంద్ర వరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో మరో కొత్త సదుపాయం అందుబాటులోకి రానుంది. త్వరలో ఎలక్ట్రిక్ వాహనాలు ప్లాట్‌ఫాంపై పరుగులు పెట్టనున్నాయి. బయటి నుంచి రైల్వే ప్లాట్‌ఫాంపైకి, అక్కడ నుంచి బయటకు ప్రయాణికులను తరలించడానికి ఈ సదుపాయాన్ని తీసుకొస్తు న్నారు. రైలు బోగీ వద్దకు ఈ వాహనాలు వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకొని బయట ప్రాంగణంలో దింపుతాయి. అందుకు ఒక్కొ క్కరికి రూ.50 చొప్పున వసూలు చేస్తారు. రెండు ఎలక్ట్రిక్ వాహనాలు వచ్చే నెల 29వ తేదీలోపు రాజమండ్రి రైల్వే స్టేషనులో అందుబాటులోకి రానున్నాయి.ఈ మేరకు టెండర్లు ఖరారయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనాల వల్ల వృద్ధులు, రోగులకు బాగా ఉపయుక్తంగా ఉంటుంది. ఎన్ఎస్‌జీ-2 హోదా దక్కించుకొన్న రాజమండ్రి రైల్వే స్టేషనల్లో మరిన్ని మెరుగైన సదుపాయాల కల్పనకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే విజయవాడ, విశాఖలో ప్రారంభించిన ఎలక్ట్రిక్ వాహనాలు విజయవంతమయ్యాయి.

జీవకారుణ్య సంఘం ఆస్తులు కాపాడాలి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28: దాత ఆశయాలకు విరుద్ధంగా రాజమహేంద్రవరం గౌతమి జీవకారుణ్య సంఘం ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తన తండ్రి కనికిరెడ్డి జ్ఞాపకార్థం గౌతమీ జీవకారుణ్య సంఘంలోని వృద్ధులకు విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం అన్నదాన వితరణ చేశారు. 40 ఏళ్ల కిందట మట్టే నారాయణమ్మ అనే దాత గౌతమీ జీవకారుణ్య సంఘానికి 19.7 ఎకరాల స్థలాన్ని దానం చేశారని, ఆస్తులన్నీ వృద్ధాశ్రమం సంస్థకే చెందాలని దాత వీలు రాశారన్నారు.



కొవ్వూరులో పార్టీ పతాకం ఎగురవేస్తున్న ముప్పిడి, ద్విసభ్య కమిటీ



నిడదవోలులో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శేషారావు



దేవరపల్లిలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కూటమి గెలుపు ఖాయం

- టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి
- ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు
- ఎన్టీఆర్‌కు నాయకుల నివాళి.. పార్టీ పతాకాల ఆవిష్కరణ

కొవ్వూరు, మార్చి 29: రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గెలుపు ఖాయమని నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కొవ్వూరు నియోజకవర్గ కార్యాలయంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ముప్పిడి మాట్లాడుతూ అన్న నందమూరి తారక రామారావు సినీ రంగంలో రాణిస్తూనే తెలుగువారి ఆత్మ గౌరవం కాపాడాలని బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం సారా, మద్యం, గంజాయి, పార్టీ నాయకుల అరాచకాలకు నిలయంగా మారిందన్నారు. ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరమని, రాష్ట్రాభివృద్ధి, పిల్లల భవిష్యత్తు కై 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాసరావు, సూర్యదేవర రంజిత్, మద్దుల సత్యనారాయణ, జొన్నలగడ్డ శ్రీనివాస్, అనుపిండి చక్రధరరావు, బర్ల శ్రీనివాస్, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పూలమాలలు వేసి నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ప్రజా పరిపాలన చేసారని, సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ల అని నమ్మిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండలాధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, వెలగన సూర్యారావు, నాయకులు తిరుపతి సత్యనారాయణ, అబ్బిశెట్టి సత్తిరాజు, బుగ్గే శివరామకృష్ణ శాస్త్రి, బైపే రాజేశ్వరరావు, ఎమ్‌డి షాజహాన్ పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని ఖండవల్లిలో టీడీపీ మండలాధ్యక్షుడు అతికాల రామకృష్ణమ్మ, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు భూపతిరాజు రవివర్మ, పెరవలిలో సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, నల్లాకులవారిపాలెంలో సర్పంచ్ నల్లాకుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. అలాగే తీపర్రులో జరిగిన కార్యక్రమంలో కంటిపూడి సూర్యనారాయణ, నందమూరి నారాయణరావు పాల్గొన్నారు. కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, కొత్తపల్లి, అన్నవరప్పాడు గ్రామాల్లో టీడీపీ నాయకులు పార్టీ పతాకాలను ఆవిష్కరించారు.

దేవరపల్లి: దేవరపల్లిలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద గన్నమని హరికృష్ణ కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్ 1982లో టీడీపీని స్థాపించారని, 9నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రి పీఠం అధిరోహించారన్నారు. పార్టీ బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో కొండపల్లి దొరయ్య, కాట్రు భీమరాజు, ఉప్పులూరి రాంబాబు, ముళ్ళపూడి సత్యనారాయణ, నడింపల్లి విజయ్‌కుమార్ రాజు, రాజేశ్వరి పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు కేక్ కోసి, స్వీట్లు పంపిణీ చేశారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో జ్యేష్ట శ్రీధర్, కూనపం ప్రసాద్‌బాబు, కొర్లపాటి రాము, జ్యేష్ఠ శ్రీను, గన్నమని చిట్టిబాబు, రాము, మద్దిపాటి రమేష్, మద్దిపాటి రోహిత్‌సాయి పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దేవంలో ఎస్సీ సెల్ నాయకుడు తిగిరిపల్లి గోపి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైగాపుల సంపత్, కడలి కిరణ్‌కుమార్, మట్టా సూర్య, బోడపాటి కాశీ, ముప్పిడి రాజేష్, తిగిరిపల్లి పండు, తిగిరిపల్లి గంగయ్య, గోలి మణికంఠ పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులో టీడీపీ స్థూపం వద్ద పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ ఏర్పడిందని మాజీ ఎంపీపీ కేతా సాహెబ్ అన్నారు. కార్యక్రమంలో ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, దొంగ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నెలటూరులో జరిగిన కార్యక్రమంలో తాళ్ళూరి హరిశ్చంద్రప్రసాద్, తాళ్లూరి శ్రీనివాస్, నందిగం శ్రీను, ఈడుపుగంటి మురళి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని ఉండ్రాజవరం, తాడిపర్రు, మోర్త, వేలివెన్ను, కాల్ధరి, సూర్యారావుపాలెం తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కారక్రంమాల్లో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గోపాలపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



తాళ్లపూడిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పరమేశ్వరరావు



చాగల్లు: నెలటూరులో కేక్ కట్ చేస్తున్న చిన్నారి

కల్వారి గిరిలో శిలువ ధారియై..

- ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు..పలుచోట్ల శిలువ యాత్రలు
- ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలపై ప్రబోధ

కొవ్వూరు, మార్చి 29: సర్వమానవాళి విమోచనకు ప్రభువైన క్రీస్తు శిలువను మోసి, ప్రాణాలు అర్పించిన రోజును గుడ్ ఫ్రైడేగా క్రైస్తవులు శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొవ్వూరులోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి, ఇమ్మానియేలు మినిస్ట్రీస్, టౌన్ లూథరన్ చర్చి, అగాపే సంఘం, సియోను ప్రేయర్ హౌస్‌లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానించారు. సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి పాల్గొన్నారు. కొవ్వూరు మండలం తోగుమ్మి ఆర్‌సీఎం చర్చి నుంచి వేములూరు దీప్తి స్కూల్లోని ఆర్‌సీఎం చర్చి వరకు పవిత్ర శిలువ మార్గం(యాత్ర) నిర్వహించారు. సంఘకాపరి ఫాదర్ ఫ్రాన్సిస్, ఫాదర్ ప్రణయ్‌ల ఆధ్వర్యంలో విశ్వాసులు భుజంపై శిలువను ధరించి, క్రీస్తు గీతాలాపన, శిలువ మార్గారాధన చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, ప్రేమ విందు స్వీకరించి 40 రోజులుగా చేపట్టిన ఉపవాస దీక్షలను విరమించారు. శనివారం రాత్రి జాగారపు ప్రార్థనలతో క్రీస్తు పునరుద్ధాన పండుగను నిర్వహించనున్నట్లు సంఘకాపరి తెలిపారు. కార్యక్రమంలో వలయవీడు నెల్సన్ ఆంటోని, పశివేదల, తోగుమ్మి గ్రామాల సంఘస్థులు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెం ఆర్‌సీఎం చర్చి జరిగిన కార్యక్రమంలో ఏసుక్రీస్తు శిలువ మరణానికి ముందు పలికిన ఏడు మాటలను దైవజనులు వివరించారు. అలాగే గోపాలపురం నుంచి గ్రామానికి శిలువ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కోమటిగుంట, గోపాలపురం, వేలచింతలగూడెం గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో ఆర్‌సీఎం చర్చి సంఘస్థులు వేగేశ్వరపురం, తాళ్లపూడి గ్రామాల్లో శిలువ యాత్ర చేపట్టారు. ఫాదర్ డి.జాన్ శిలువ మోస్తూ సంఘస్థులకు భక్తి మార్గాన్ని ప్రబోధించారు. అన్నదేవరపేటలోని ఆర్‌సీఎం చర్చిలో జరిగిన ప్రార్థనల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఫాదర్ ఎలీషా ప్రార్థనలు చేసి ముప్పిడిని దీవించారు. అనంతరం గ్రామంలోని పలు దేవాలయాలను సందర్శించారు. రాష్ట్రానికి సైకో పాలన నుంచి విముక్తి కలిగించాలని, ప్రజా సంక్షేమాన్ని కోరే కూటమి పరిపాలనను అమలులోకి తీసుకొచ్చేందుకు చేస్తున్న కృషి ఫలించాలని ప్రార్థించానని ముప్పిడి అన్నారు. కార్యక్రమంలో జీవీ ప్రసాద్, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, తొండెపు భరత్, ఇంజరపు అబ్బులు, డి.శేషగిరి, అయితం మణికంఠ, చెవ్వూరి రాము పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు చేసి, సువార్త గీతాలను ఆలపించారు. ఉండ్రాజవరంలోని లూథరన్, ఆర్‌సీఎమ్, పెంతుకొస్తు, బైబిల్‌మిషన్, జీడీఎమ్, క్రీస్తుసంఘం తదితర చర్చిల్లో జరిగిన వేడుకల్లో విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరపల్లి: గుడ్‌ఫ్రైడే సందర్భంగా మండలంలోని గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత ఆలయం సహా పలు ప్రధాన చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. ఏసుక్రీస్తు వేషధారణలో శిలువలు మోశారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు గౌరీపట్నంలోని మేరీమాత మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, శిలువను మోశారు. ముప్పిడి మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే.. ఏసుక్రీస్తు చేసిన అపారమైన త్యాగాన్ని గుర్తు చేస్తుందని, ఈ రోజు ప్రేమను పంచుకోవడానికి, ఇతరులను క్షమించడానికి గుర్తుగా ఉంటుందన్నారు. యర్నగూడెంలోని సెయింట్ జోసఫ్ స్కూల్లో శిలువ మోస్తూ గ్రామంలో ప్రదర్శన చేశారు.

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెంలో జరిగిన వేడుకల్లో విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్ పాస్టర్ మరపట్ల జోజి సిలువపై యేసు పలికిన ఏడు మాటలను ధ్యానించారు. ప్రపంచ మానవాళి పాప పరిహారార్థం యేసు ఈ లోకంలో మానవ రూపంలో జన్మించి సిలువపై వేలాడుతే మృతి చెందాడని చెప్పారు. ముసుళ్ళకుంటలో ఫాదర్ అంటోని, పాస్టర్ యేసురత్నం ఆధ్వర్యంలో సిలువను మోస్తూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సుభద్రపాలెంలో బ్రదర్ సంజాయ్, పోతవరంలో రాజేష్‌కుమార్, అనంతపల్లిలో నోవహు, నల్లజర్ల ఆర్‌సీఎంలో ఫాదర్ జోసఫ్ శాంతప్ప ఆధ్వర్యంలో సిలువ ధ్యాన ఆరాధనలు జరిగాయి.



కొవ్వూరు: వేములూరులో శిలువ యాత్ర చేస్తున్న ఆర్‌సీఎం సంఘస్తులు



తాళ్లపూడిలో శిలువ యాత్ర నిర్వహిస్తున్న ఆర్‌సీఎం చర్చి సంఘస్థులు



నల్లజర్ల: ముసుళ్లకుంటలో శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

ముసలమ్మ తల్లికి లక్ష పుష్పార్చన



అమ్మవారి పుష్పాలంకరణకు తీసుకొచ్చిన పువ్వులు

కడియం, మార్చి 29: కడియపులంక ముసలమ్మ తల్లి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా మూడో రోజు శుక్రవారం కావడంతో కొత్తపల్లి సత్తిరాజు-సత్యవతి దంపతులు, సత్యదేవానర్సరీ సంయుక్త సహకారంతో లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. రకానికి 108 పూలు చొప్పున 108 రకాల పూలతో అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

కడియంలో చలివేంద్రం ఏర్పాటు

కడియం, మార్చి 29: కడియంలో డీఎస్ఆర్ వెజిటబుల్స్ దొడ్డా శ్రీను పేరిట వారి కుటుంబసభ్యులు దొడ్డా బాబి, దొడ్డా తాతాజీ శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు, బాధ్యత సేవాసంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో దొడ్డా బుజ్జి, గిరజాల నాగేశ్వరరావు, ముమ్మిడి ప్రసాద్, మర్రి చంద్రరావు, ఆర్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

జనసైనికులంతా నా వెంటే

ఆత్మీయ సమావేశాల్లో జ్యోతుల నెహ్రూ



రంపయర్రంపాలెంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న జ్యోతుల నెహ్రూ

గోకవరం, మార్చి 29: నియోజకవర్గంలోని అసలైన జనసైనికులంతా తన వెంటే ఉన్నారని జగ్గంపేట టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెం, గంగంపాలెం, రంపయర్రంపాలెం, పెంటపల్లి, వీరలంకపల్లి, అచ్యుతాపురం, గుమ్మళ్ళదొడ్డి, ఇటికాయిలపల్లి, గాదెలపాలెం, తంటికొండ, కృష్ణునిపాలెం గ్రామాల్లోని జనసేన నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెహ్రూ మాట్లాడుతూ పొత్తు ధర్మంలో భాగంగా నియోజకవర్గంలో ప్రతి జనసైనికుడిని ఆత్మీయంగా కలుస్తున్నానని, నాలుగు మండలాల జనసేన కన్వీనర్లు తనతో కలిసి నడవడం పొత్తు ధర్మానికి శుభసూచకమన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేయడం కూడా తన గెలుపుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా
- నన్నయ యూనివర్శిటీలో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



నన్నయ వర్శిటీలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న సీఈవో మీనా

దివాన్‌చెరువు, మార్చి 29: ఈవీఎం, ఇతర అనుబంధ యూనిట్స్ భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతతో పాటు ఇతర రక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) ముకేష్‌కుమార్ మీనా వెల్లడించారు. జిల్లా పర్యటనలో భాగంగా దివాన్‌చెరువు పరిధిలోని నన్నయ యూనివర్శిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో చేపట్టిన కార్యాచరణ ప్రణాళికలు, రూట్ మ్యాప్‌పై సమగ్ర సమాచారాన్ని జిల్లా కలెక్టర్ మాధవీలత సీఈవోకు వివరించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఈవీఎమ్‌లు, ఇతర అనుబంధ యూనిట్స్ నన్నయ వర్సిటీకి తీసుకొస్తామన్నారు. రిసెప్షన్ కేంద్రం వద్ద ఈవీఎమ్‌లను స్వీకరించిన అనంతరం నిర్దిష్టమైన రూట్‌లో ఆయా నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూమ్‌కి తరలించనున్నట్లు వివరించారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బ్యాలెట్ యూనిట్స్, రిసెప్షన్ కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూమ్ వరకు తీసుకొని వచ్చే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ ఇస్తామన్నారు. తదనంతరం సీఈవో ముకేష్‌కుమార్ మీనా చేసిన సూచనల మేరకు పలు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. పోలీస్ పరంగా అన్ని భద్రతా చర్యలు తీసుకోవడంతోపాటు, జిల్లా ఎన్నికల అధికారితో సమన్వయం చేసుకుంటామని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా సీఈవో వెంట రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో ఎన్.తేజ్‌భరత్, కొవ్వూరు ఆర్వో అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, రాజానగరం ఆర్వో చైత్రవర్షిణి, నిడదవోలు, గోపాలపురం ఆర్వోలు రమణానాయక్, శివజ్యోతి, తదితరులున్నారు.



జిల్లాలో కార్యాచరణ ప్రణాళికలను సీఈవోకు వివరిస్తున్న కలెక్టర్

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	కుంగ్‌ఫూ పాండా..
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	భీమా

నిడదవోలు

వీ మ్యాక్స్	డీజే టిల్లు-2
రాధాకృష్ణ	కింగ్ ఆఫ్ గాడ్జిల్లా
శ్రీగణపతి	ఓం బీం బుష్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి